
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 9 డిసెంబరు 2025



గరిష్ఠం 27.8
కనిష్ఠం 16.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	577.40 (275.5168)	20,167	20,167
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	457.31	457.31
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.554 (43.5481)	900	4,400

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



సంగ్రామం

తారస్థాయిలో ప్రచారం

- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధికార, ప్రతిపక్షాలు
- ప్రచారంలో పాల్గొంటున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

6


అన్నా.. పైసాల్లేవా ఏందీ?

- పదవి కావాలంటే పంచాల్సిందే..
- సర్పంచ్ అభ్యర్థి, సామాన్యుడి మధ్య సరదా సంభాషణ

6

పల్లె పాలనలో ఆదర్శ దంపతులు

తొలివిడత ప్రచారం నేటితో బంద్



- నేటి సాయంత్రం నుంచి మద్యం దుకాణాలకు తాళం
- ఉమ్మడి జిల్లాలో 589 పంచాయతీల్లో తొలి విడత ఎన్నికలు
- ఈ నెల 11న పోలింగ్
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తొలివిడత ఎన్నికలు నిర్వహించే గ్రామపంచాయతీల్లో ప్రచారం వేడెక్కింది. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5గంటలతో ప్రచారం గడువు ముగుస్తుండడంతో అభ్యర్థులు, వారి తరఫున ప్రచారం చేసే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ,

అభ్యర్థుల గెలుపుకోసం ప్రచార రంగంలోకి దిగిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు వ్యూహాలు పన్నడంతో పాటు, ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఓ వైపు ప్రచారం సాగిస్తూనే, మరోవైపు బుజ్జగింపులు, తాయిలాల ఎరవేస్తూ అభ్యర్థుల గెలుపునకు శ్రమిస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాల అధికార యంత్రాంగం, పోలీసులు పోలింగ్ నిర్వహణకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సులు, ఎన్నికల సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 14 మండలాల్లోని 318 పంచాయతీలకు 21 ఏకగ్రీవం కాగా, ఇందుగుల, పేరూరు, అభంగాపురం పంచాయతీల్లో ఎన్నికలు నిలిచాయి. మిగిలిన 294 గ్రామపంచాయతీలు, 2,684 వార్డు స్థానాలకు మొదటి విడతలో పోలింగ్ జరగనుంది. సూర్యాపేట జిల్లాలో ఎనిమిది మండలాల్లోని 159 గ్రామాల్లో ఏడు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 152 స్థానాలకు, 1,241 వార్డులకు తొలిదశలో పోలింగ్ జరగనుంది. యాదాద్రి జిల్లాలో ఆరు మండలాల్లోని 153 పంచాయతీలకు 10 ఏకగ్రీవం కాగా, మిగిలిన 143 పంచాయతీలకు, 1,155 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేస్తోంది.

నేటి సాయంత్రానికి ఆగనున్న మైకులు

ప్రచారం గడువు ముగుస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో నేటితో అధికారికంగా ప్రచారం ముగియనుంది. దీంతో మొదటి విడత ఎన్నికలయ్యే గ్రామాల్లో చివరి రోజు ర్యాలీలు, సభలు నిర్వహించేందుకు అభ్యర్థులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే ఇంటింటి ప్రచారాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో చివరి రోజు ప్రతీ ఓటరును కలిసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, మాజీలు అన్ని పంచాయతీల్లో పార్టీ అభ్యర్థుల కోసం విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. నేటి సాయంత్రం 5గంటల తర్వాత ప్రచారం ఆగిపోనుండడంతో ప్రచార రథాలు, మైకులు, జెండాలను తొలగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

11వ తేదీ వరకు మద్యం దుకాణాలు బంద్

ఎన్నికల కోడ్ నేపథ్యంలో మొదటి విడత ఎన్నికలు జరిగే అన్ని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి మద్యం దుకాణాలను మూసివేస్తారు. మద్యం విక్రయాలు ఎక్కడ జరిగినా వెంటనే సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీస్, ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. 11వ తేదీ సాయంత్రం 5గంటల తరువాతే మద్యం దుకాణాలు తెరుచుకుంటాయి. అయితే గ్రామాల్లో పలువురు పార్టీల నాయకులు ఇప్పటికే మద్యం డంపులకు తరలించారని, బుధవారం మద్యం పంపిణీ ఉంటుందని ప్రచారం సాగుతోంది.



ఖుషీ

- ఉచిత బస్సు ప్రయాణంతో రూ.620.13కోట్లకు పైగా ఆదా
- ఇప్పటికి 12.35కోట్ల మందికిపైగా ప్రయాణం
- సగటున నిత్యం ప్రయాణిస్తున్న 36.70లక్షల మంది మహిళలు
- రద్దీకి అనుగుణంగా పెరగని బస్సుల సంఖ్య
- మహాలక్ష్మి పథకానికి నేటికి రెండేళ్లు

నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని 2023, డిసెంబరు 9న అమలులోకి తెచ్చింది. దీంతో ఈ పథకానికి నేటికి రెండేళ్లు పూర్తికానున్నాయి. ఉచిత ప్రయాణంతో ఉమ్మడి జిల్లా మహిళలకు రూ.620.13కోట్లకుపైగా ఆదా అయింది. ఆ మొత్తాన్ని మహిళలు కుటుంబ అవసరాల కోసం వినియోగించారు.

మహాలక్ష్మి పథకం ప్రారంభమైన నాటి నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులను కలిసేందుకు, పండుగలు, శుభకార్యాలు, ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాలు చేసే మహిళలు, ఇతర ప్రాంతాల్లో పనికి వెళ్లేందుకు కూలీలు

మిగతా 7వ పేజీలో...

● మహాలక్ష్మి పథకంతో ప్రయోజనం



మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ప్రయోజనం చేకూరుతోంది. ఈ రెండేళ్లలో 12.35కోట్ల మంది మహిళలు ప్రయాణించారు. మహిళల ప్రయాణానికి తగిన విధంగా రీజియన్ పరిధిలో అన్ని రూట్లల్లో బస్సులు నడుపుతున్నాం. ఎలాంటి అసౌకర్యం లేకుండా బస్సులను ఏర్పాటు చేసి పథకం సద్వినియోగం అయ్యేలా చూస్తున్నాం. రానున్న రోజుల్లో మహిళా ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం.

- కె.జానిరెడ్డి, ఉమ్మడి జిల్లా రీజనల్ మేనేజర్

నామినేషన్ల ఉపసంహరణకు నేడు ఆఖరు

నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 9వ తేదీ చివరి రోజు. డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లోని 269 సర్పంచ్ స్థానాలకు, 2,206 వార్డు స్థానాలకు ఈ నెల 17న ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా, 9వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉండనుంది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏకగ్రీవ పంచాయతీలు మినహా మిగతా సర్పంచ్ స్థానాలకు 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటిస్తారు. అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహిస్తారు.



హోంగార్డుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

హోంగార్డుల సంక్షేమానికి కృషి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో భాగమైన హోంగార్డులు పోలీసులతో సమానంగా శాంతిభద్రతల పరిరక్షణలో పాల్గొంటారని, వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుల కోసం ఏర్పాటు చేసిన 'దర్బార్'లో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, నేర సంబంధిత విధుల నిర్వహణలో హోంగార్డులు క్రియాశీలక పాత్ర పోషించడం ప్రశంసనీయమన్నారు. హోంగార్డు సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం రోజువారీ వేతనాన్ని రూ.921 నుంచి రూ.1,000కి పెంచిందని, పరేడ్ అలవెన్స్ రూ.100 నుంచి రూ.200, యూనిఫాం అలవెన్స్ రూ.7,500, విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బందికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ రాము, హోంగార్డు ఆర్ఐ శ్రీను, అడ్మిన్ ఆర్ఐ సంతోష్, ఎంటీ ఆర్ఐ సూరప్పనాయుడు, ఆర్ఎస్ఐ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

(ఆంధ్రజ్యోతి, కనగల్): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని జీ.ఎడవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థులు నిబంధనలకు లోబడి ప్రచారం నిర్వహించాలన్నారు. ఓటర్లకు మద్యం, డబ్బు పంపిణీ చేయడం నిషేధమన్నారు. అంతకుముందు గ్రామంలో పోలీసు ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించాయి. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతా నిర్భయంగా ఓటేయాలి

అదనపు ఎస్పీ రమేష్



ఉప్పలంచలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రమేష్

శాలిగౌరారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు నిర్భయంగా ఓటేయాలని అదనపు ఎస్పీ రమేష్ అన్నారు. మండలంలోని ఉప్పలంచ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేలా సహకరించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటువేయాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి, ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంఘ విద్రోహ శక్తులను కఠినంగా శిక్షిస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ సైదులు, హెడ్‌కానిస్టేబుల్ నజీరుద్దీన్, పీసీలు జానయ్య, లక్ష్మణ్, నాగయ్య, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



శాలిగౌరారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీచేసి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

శాలిగౌరారం, కేతేపల్లి డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో, కేతేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. పోలింగ్ సామగ్రి, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామస్థాయి ఎన్నికలకు ప్రాధాన్యం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు కీలకంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన సామగ్రి పంపిణీలో ఆలస్యం లేకుండా చేయాలన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. బ్యాలెట్ బాక్సుల స్వీకరణలో గందరగోళం లేకుండా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిరంతరం ఉండాలని, ఓటర్ల క్యూలైన్ వ్యవస్థను అమలు చేయాలని, సీసీ కెమెరాలు ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా తాగునీరు, విశ్రాంతి గదులు, పారిశుద్ధం, వైద్య సౌకర్యాలు, ర్యాంపులు, లైటింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో కేతేపల్లి ఎంపీడీవో పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎంపీడీవోతో కలిసి పనిచేయాలని తహసీల్దార్ రమాదేవిని ఆదేశించారు. ఆమె వెంట జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీపీవో వెంకయ్య, ఆర్డీవో యారాల అశోక్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్లు బిట్ల వరప్రసాద్, రమాదేవి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, బి.శ్రీనివాసరావు, ఎంపీవో నాగలక్ష్మి, తదితరులు ఉన్నారు.

అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



కేతేపల్లి పీహెచ్‌సీలోని ఆయుర్వేద ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కేతేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం కేతేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల వివరాలను ఆస్పత్రి వైద్యాధికారి కొంద్ర అర్చనను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రసవాల వివరాలు, మందుల నిల్వలు, గడువు తేదీలను పరిశీలించారు. కుక్క, పాము కాటు వ్యాక్సిన్ నిల్వలను సమీక్షించారు. ఆసుపత్రిలోని ఆయుర్వేద విభాగాన్ని కూడా తనిఖీ చేశారు. ఇక్కడ మందులు, నిత్యం ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను వైద్యురాలు నేహాను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాలరెడ్డి, ల్యాబ్‌టెక్నీషియన్ యాదగిరి, సిబ్బంది రమాదేవి, నిర్మల, మేరి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో తుట్టెలు కట్టిన బియ్యం

- మెనూ పాటించని కేంద్రాలు
- రోజుల తరబడి గుడ్డు నిల్



జీకే.అన్నారంలో చారుతో భోజనం చేస్తున్న చిన్నారులు, అన్నెపర్తిలో తుట్టెలు కట్టిన బియ్యం

నల్లగొండ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులకు పోషకాహారం అందించే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీలను ఏర్పాటు చేసింది. అయితే అంగన్‌వాడీల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా పౌష్టికాహారం అటుంచితే నాణ్యతలేని ఆహారంతో మహిళలు, చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది. ఎక్కువ రోజులు నిల్వ ఉన్న బియ్యాన్ని సరఫరా చేయడంతో అవి తుట్టెలు కట్టాయి. వాటిని కొన్ని అంగన్‌వాడీల్లో శుభ్రం చేసి వంట చేస్తుండగా, కొన్నిచోట్ల అలాగే వండుతున్నారు. దీంతో ఈ అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అనారోగ్యం బారినపడే అవకాశం ఉంది. అదేవిధంగా మండలంలోని కొన్ని కేంద్రాల్లో గుడ్లను సరఫరా చేయడం లేదు. దీంతో చిన్నారులకు, మహిళలకు రోజుల తరబడి గుడ్లు అందడం లేదు. దీంతో పాటు కొన్ని కేంద్రాల్లో చారుతో అన్నాన్ని సరిపెడుతున్నారు. మండలంలోని అన్నెపర్తి గ్రామంలో పురుగు పట్టిన, తుట్టెలు కట్టిన బియ్యాన్ని వండుతున్నారు. జీకే అన్నారం గ్రామంలో రోజుల తరబడి గుడ్లు పంపిణీ చేయడం లేదు.

ఈ విషయమై ఐసీడీఎస్ అధికారి నిర్మలను వివరణ కోరగా ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్లను అప్రమత్తం చేస్తున్నామని, ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు

మర్రిగూడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్టు జిల్లా ఎన్నికల సహాయ అధికారి మున్నయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో 170 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 35,785 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లుకు అన్ని వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా కొండూరు, రాజుపేట, రాంరెడ్డిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీచేశారు. ఆయన వెంట మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో బిట్టు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

నేడు ఎన్జీ కళాశాలలో జాబ్‌మేళా

నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌కేసీ, రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కెమిస్ట్రీ విద్యార్థుల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. 2021 నుంచి 2025 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు 2022 నుంచి 2025 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులు అని అన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10గంటలకు కళాశాలలోని సెమినార్ హాల్‌లో హాజరుకావాలని తెలిపారు.



టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సైదులకు ఫిర్యాదుచేస్తున్న బీసీ నాయకులు

రిజర్వేషన్లపై మాట తప్పిన సీఎం

సీఎం రేవంత్‌రెడ్డిపై నల్లగొండ బీసీ సంఘ నేతల ఫిర్యాదు

నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిన నాటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారని, ఆయనపై కేసు నమోదు చేయాలని బీసీ సంఘం నాయకులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సైదులుకు బీసీ సంఘం నాయకులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్, బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్లు తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీ అనే ఒక బుక్‌లెట్ కూడా తీశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోగా కొత్త జీవో 46 ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నికలు నిర్వహిస్తున్నారని వారు విమర్శించారు. బీసీలను విస్మరించినందున చట్ట ప్రకారం కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు యాదగిరి, అజయ్‌కుమార్, వెంకన్న, సతీష్, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



కేతేపల్లిలో మాట్లాడుతున్న డీపీఎం మోహన్‌రెడ్డి

కేతేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం పొదుపు సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో డీపీఎం డి.మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కేతేపల్లి మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల అభివృద్ధికి పొదుపు సంఘాల ద్వారా స్త్రీనిధి రుణాలు, బ్యాంకు రుణాలు అందిస్తున్నామన్నారు. వాటితో ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం దివ్యాంగుల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రాధిక, సీసీలు శ్రీనివాసరెడ్డి, రమణయ్య, రాజ్‌కుమార్, గంగయ్య, సిబ్బంది పద్మ, సౌజన్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అన్నా.. పైసల్లేవా ఏందీ.?

● పదవి కావాలంటే పంచాల్సిందే..

● సర్పంచ్ అభ్యర్థి, సామాన్యుడి మధ్య సరదా సంభాషణ



రచ్చబండ RACHABANDA

మిర్యాలగూడ, వ్యవసాయం(ఆంధ్రజ్యోతి): ఏందన్నా.. పైసల్లేకుండనే ఎలచ్చన్ల నిలబడ్డవా ఏంది.. అస్సలు పైసలు తీత్తలేవ్.. ఊకనే తిరిగి పచారం చేత్తున్నవ్.. దండాలు దస్కాలు పెట్టి సేతులు కాళ్లు పడుతున్నవ్. గయినా జనం నీకల్లి ఓర సూపు కూడా సూత్తలేరు. గిట్టయితే నీకు ఓట్లు ఓరు ఏస్తరన్నా సెప్పు. అరే తమ్మి నువు సెప్పింది నిజమే.. పైసల్లేకుంటే రాజకీయం ఏడుంది.. గియ్యాల నీకు మంచోడవా సెడ్డోడివా అని జనం సూత్తలేరు. ఎన్ని పైసలు ఖర్చు పెడతడు అని చూత్తరు.. గిదీ గియ్యాల పరత్తితి.. సర్పంచ్ అభ్యర్థి ఒక సామన్యుడి మధ్య జరిగిన సరదా సంభాషణ నేటి రచ్చబండ..

సామాన్యుడు : ఏందన్నా అంతా మంచిగేనా. గీ సారి ఊళ్ల సర్పంచ్‌గా పోటీ చేత్తున్నవ్ అంటగా. నీ తానా పైసలున్నయా లెవ్వా.. ఏందీ కథ..

అభ్యర్థి : నువు సెప్పింది నిజమే తమ్మి. సర్పంచ్ కావాలని కోరికతో ఓ పార్టీ పెద్దాయన దగ్గరి పొయినా గపుడు గాయన ఏమన్నడంటే. పైసల్లేంది పనికిరావ్ నీ తాన ఎన్ని పైసలు ఉన్నయి. ఎలచ్చన్ల ఎంత ఖర్చు పెడతవ్ అడిగిండు. నువు సెపితే గపుడు ఆలోచిత్తా అన్నడు. నేనొక గింత పెడతా అని సెప్పిన గపుడు సరే అన్నడు.

సామాన్యుడు : అయితే నీ తాన పైసలు ఉన్నయా అన్నా.. మరి ఎందుకన్న ఎలచ్చన్లు ఇంక వారం రోజుల్లో పెట్టుకుని పైసలు బయటకు తీస్తలేవ్.

అభ్యర్థి : అరే తమ్మీ.. గియాల గిట్టనే తిరగాలే. గిపుడు పైసలు ఇస్తే.. ఓటేసి నాటికి జనం మరిసిపోతరు. అప్పటికి మళ్లీ సేతులు చాత్తరు. గిప్పటి నుంచే పైసలు పంచుతే మన తాత తండ్రుల నుంచి వచ్చిన ఆస్తులు సరిపోక అప్పులు పాలయితం.

సామాన్యుడు : ఊక తిరిగి దండాలు దస్కాలు పెడుతుండ్రు. పైసలిస్తలేరంది.. అని జనం అనుకుంటున్నరు. గందుకే అడిగినా జర గరం కాకే అన్నా. మీ తాత దండ్రుల నుంచి మీ కుటుంబం శానా రోజులు రాజకీయాల్లో ఉన్నరు. మీకు శానా మంచి పేరుంది. గప్పట్లో ఊరి కోసం ఎంతో సేసిండ్రు కదా. అయినా జనం ఓట్లకు పైసలు ఆశిస్తున్నరేందన్నా.

అభ్యర్థి : అరే తమ్మీ ఏ కాలంలో ఉన్నవ్. ఇది కలికాలం. మూడు పాళ్ల అధర్మం. ఒక పాలు ధర్మం ఉంటదంట. గియాల మంచికి ఇలువ లేదు. పైసలుంటే సాలు ఆళ్లకే జనాలు నీరాజనాలు పలుకుతరు. గెట్ల సంపాదించిండు అనే ఇషయాన్ని జనం పట్టించుకోట్లే.

సామాన్యుడు : నిజం సెప్పినవ్ అన్నా.. ప్రతోనికి పైసల మీద యావ ఎక్కువయింది. మన తాన పైసల్లేకుంటే. ఇంటోళ్లే పట్టించుకోరు. ఇంక జనం సంగతి సెప్పేదేముందిలే..

అభ్యర్థి: పదవి కావాలంటే పైసలు ఇయ్యాల్సిందే..మందు పంచాల్సిందే.. లేక పోతే ఓటేసే పరిత్తితి లేదు..మేం ఊకనే ఓట్లు ఎయ్యాం అంటున్నరు.. ఇంటి మీద కొచ్చి పంచాయతీ చేసేకాడికి తయారండ్రు జనం.. ఏం సేద్దాం సెప్పు..

సామాన్యుడు : జనం గిట్ల తయారయినాక మీ లాంటోళ్లు ఏం సేత్తరు అన్నా.. పైసలు పంచాల్సిందే. పదవి కొట్టాల్సిందే.

అభ్యర్థి : ఎలచ్చన్ల పైసలు పంచినాంక ఊరును బాగు పరసాలంటే గెట్ల సాధ్యమయింది సెప్పు. పెట్టిన పైసలు ఎట్ల భర్తీ చేసుకోవాలనే ఆలోచన సేత్తం. గంత కంటె మేం ఏం సేయలేం తమ్మీ. జనంతో పాటు మనం అంతే..

సామాన్యుడు : ఈ జనం మారరు అన్నా ఆళ్ల అంతే.. పోయెత్త అన్నా..

పల్లె పాలనలోనూ ఆదర్శ దంపతులు

గ్రామపంచాయతీల్లో పలువురు దంపతులు సర్పంచ్‌లుగా విజయం సాధించారు. గ్రామాలను అభివృద్ధి చేసి ఆదర్శ పరిపాలనతో ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దారు. వరుసగా పలు పర్యాయాలు ఎన్నికై తమదైన శైలిలో అభివృద్ధి బాటలో నడిపి ఉత్తమ గ్రామ అవార్డులకు ఎంపికకు కృషి చేశారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండల పరిధి లోని కచలాపురం గ్రామ తొలి సర్పంచులు గురిజ రామచంద్రం-అరుణ దంపతులతో పాటు ఇప్పర్తి గ్రామ మాజీ సర్పంచులు బూడిద లింగయ్య-మల్లేశ్వరి దంపతులు సర్పంచులుగా పనిచేసి అభివృద్ధిపై తమదైన ముద్రవేశారు.

(ఆంధ్రజ్యోతి, మునుగోడు)

రామచంద్రం- అరుణ దంపతుల 25 ఏళ్ల పాలనలో..



గురిజ రామచంద్రం- అరుణ

కచలాపురం గ్రామం 1994లో ఏర్పాటైంది. గురిజ రామచంద్రం- అరుణ దంపతులు ఇద్దరూ నాలుగు పర్యాయాలు విజయం సాధించి పరిపాలన సాగించారు. 1995- 2001 వరకు తొలిసారిగా జనరల్ స్థానంలో సర్పంచ్‌గా గురిజ రామచంద్రం, 2001- 06వరకు రెండో దఫాలో తొలి మహిళా సర్పంచ్‌గా గురిజ అరుణ రామచంద్రం, 2013-19వరకు రెండోసారిగా గురిజ రామచంద్రం, 2019-25వరకు రెండోసారి గురిజ అరుణ రామచంద్రం వరుసగా రెండు పర్యాయాలు విజయం సాధించి సర్పంచులుగా మొత్తం నాలుగు పర్యాయాలు గ్రామానికి సేవలందించారు. 2006- 13లో గ్రామ రిజర్వేషన్ ఎస్సీ కేటగిరిగా మారింది. రామచంద్రం దంపతులు సూచించిన అభ్యర్థి పెద్దమామిడి వెంకటయ్య విజయం సాధించారు. తర్వాత మళ్లీ రిజర్వేషన్ మారడంతో వారే మరోసారి వరుసగా విజయం సాధించారు. వారు మొత్తం 25ఏళ్ల పాటు గ్రామానికి సర్పంచులుగా సేవలందించారు. గ్రామాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి బాటలో నడిపారు. 1997- 98, 1999- 2000, 2003-04 సంవత్సరాల్లో గ్రామం జిల్లాస్థాయిలో ఉత్తమ గ్రామంగా మూడు దఫాలు ఎంపికైంది. అప్పటి కలెక్టర్ల నుంచి సర్పంచులు రామచంద్రం- అరుణ దంపతులు వేర్వేరుగా అవార్డులు అందుకున్నారు. 2004-05లో ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణంతో పారిశుధ్య సమస్యను పరిష్కరించారు. గ్రామానికి జిల్లాస్థాయి మరో అవార్డు దక్కింది. ఆ అవార్డును రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి అందుకున్నారు. ఇది గ్రామ ప్రజల సహకారంతో దక్కిన గౌరవమని సంతోషం వ్యక్తం చేశారు.

ఇప్పర్తిలో 13ఏళ్లు లింగయ్యయాదవ్- మల్లేశ్వరి దంపతులు




బూడిద లింగయ్యయాదవ్- మల్లేశ్వరి

ఇప్పర్తి గ్రామ సర్పంచులుగా బూడిద లింగయ్యయాదవ్-మల్లేశ్వరి దంపతులు వరుసగా రెండు పర్యాయాలు విజయం సాధించారు. 2006-13వరకు బూడిద లింగయ్యయాదవ్, 2013-19 వరకు బూడిద మల్లేశ్వరి లింగయ్యయాదవ్ సర్పంచులుగా బాధ్యతలు చేపట్టారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారు. 2018లో జిల్లాస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికై అవార్డు అందుకున్నారు. గ్రామ సర్పంచులుగా లింగయ్యయాదవ్- మల్లేశ్వరి దంపతులు గ్రామస్థుల మెప్పుపొందారు.

నాయకులు చెప్పినా నై.. పోటీకే సై

● నిడమనూరు మండలంలో కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ ● 11 స్థానాల్లో బరిలో రెబెల్స్



నిడమనూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో అనేక గ్రామాల్లో పంచాయతీ పోరు కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ అన్న చందంగా ఉంది. 11పంచాయతీల్లో కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. గెలుపోటములను రెబెల్స్ ప్రభావం చేస్తారని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. సీనియర్ నాయకుడు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి చెప్పినప్పటికీ ససేమిరా అంటూ రెబెల్స్ బరిలో నిలిచారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించినా పెడచెవిన పెట్టారు. నారమ్మగూడెం, బంకాపురం, గుంటిపల్లి, రేగులగడ్డ, వెంగన్నగూడెం, వేంపాడ్, సూరెపల్లి, ఇండ్లకోటయ్యగూడెం, ఎర్రబెల్లి, వడ్డెరగూడెం, వెంకటాపురం గ్రామాల్లో కాంగ్రెస్ రెబెల్స్ పోటీ పడుతున్నారు. నియోజకవర్గంలోని ఇతర మండలాల్లో అనేక గ్రామాలు ఏకగ్రీవమైనా నిడమనూరు మండలంలో కనీసం ఒక్క పంచాయతీ కూడా ఏకగ్రీవం కాలేదు. గుంటుకగూడెం, గుంటిపల్లి, బంకాపురం, పార్వతీపురం, మార్లగడ్డక్యాంపు, ఇండ్లకోటయ్యగూడెం తదితర పంచాయతీలు ఏకగ్రీవం అవుతాయని భావించారు. మండల నాయకులకు జానారెడ్డి, జైవీర్‌రెడ్డి సూచనలు కూడా చేశారు. కానీ పోటీకే మొగ్గు చూపారు. ముఖ్య నాయకుల గ్రామాల్లో బహుముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులతో పాటు రెబెల్స్ కూడా కాంగ్రెస్ అభ్యర్థులమే అంటూ గ్రామాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ మండలంలోని 10గ్రామాల్లో పోటీ చేయడం లేదు. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా బరినుంచి తప్పుకుంది. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థులకు మద్దతు ఇస్తోంది. బీజేపీ ఒకటి, రెండు గ్రామాల్లో మాత్రమే పోటీలో ఉంది.

చలికాలం.. గుండె పదిలం

● చలికాలంలో పెరుగుతున్న కార్డియాక్ అరెస్టులు ● బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ ఉంటే చలిలో తిరగవద్దు



చలి వణికిస్తోంది. గజగజ వణికే చలితో శ్వాసకోశ, చర్మవ్యాధులతోపాటు హార్ట్ అటాక్, బ్రెయిన్ స్ట్రోక్‌లు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. అధిక చలితో రక్తనాళాలు కుచించుకుపోయి రక్త ప్రసరణలో ఇబ్బందులు ఏర్పడడంతో హార్ట్ అటాక్ వచ్చే ప్రమాదం ఉంటుంది. మారిన జీవనశైలిలో వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



ఆంధ్రజ్యోతి, భూదాన్‌పోచంపల్లి

బీపీ, షుగర్, కిడ్నీ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, టీబీ తదితర వ్యాధులతో బాధపడేవారు మరింత జాగ్రత్త తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గుండెపోటుకు చలి ఒక కారణమైనప్పటికీ ఇతర కారణాలు ఉన్నాయి. రక్తంలో కొలెస్ట్రాల్, హైబీపీ, అదుపులేని షుగర్, చిన్నప్పటి నుంచే గుండె సంబంధ సమస్యలు ఉండే వారు హార్ట్ అటాక్‌కు గురవుతారు. మామూలు రోజుల్లో కంటే చలికాలంలో ఎక్కువగా వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

చలికాలంలో.. గుండె సమస్యలు


చలి ఎక్కువగా ఉన్నప్పుడు రక్త నాళాలు కుచించుకుంటాయి. దీంతో బీపీ పెరుగుతుంది. గుండె మరింత శక్తిగా పనిచేయాల్సి వస్తుంది. ఇది గుండె వ్యాధిగ్రస్తులకు ప్రమాదకరం. చలిలో రక్తం కొంచం మందంగా మారి రక్త గడ్డలు(క్లాట్స్) ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటుంది. దీంతో హార్ట్ అటాక్, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది. చలితో శరీరం వేడిగా ఉంచేందుకు ఎక్కువ కేలరీలు, ఎక్కువ ఆక్సీజన్ అవసరం ఉంటుంది. దీంతో గుండెపై భారం పెరిగి గుండె సంబంధిత సమస్యల్ని మరింత తీవ్రతరం చేస్తాయి. చలికాలంలో రక్తపోటు(బీపీ) సాధారణంగా పెరుగుతంది. హైబీపీతో హార్ట్ అటాక్ ప్రమాదం పొంచి ఉంటుంది.

'భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన 56 ఏళ్ల వ్యక్తికి ఈ నెల 5న వేకువజామున హఠాత్తుగా గుండెల్లో నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాలు నిలిచాయి.'

గుండెపోటు ఎలా వస్తుంది..?

గుండెకు ప్రధానంగా మూడు ధమనుల ద్వారా రక్తం సరఫరా అవుతుంది. వీటిలో ఏ రక్తనాళం మూసుకుపోయినా గుండె కండరాలకు అందాల్సిన రక్తం అందక గుండెపోటు వస్తుంది. ఇలాంటప్పుడు సమయానికి ఆస్పత్రికి తీసుకెళ్తే బాధితులను బతికించేందుకు అవకాశముంటుంది. కార్డియాక్ అరెస్టు జరిగిన తర్వాత హాస్పిటల్‌కు తీసుకెళ్లడం ఎంత ముఖ్యమో.. సీపీఆర్ ప్రక్రియపై అవగాహన ఉన్నవారు సీపీఆర్ చేయడం కూడా అంతే ముఖ్యం.

జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి



40 ఏళ్ల దాటిన వారు ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్, ట్రెడ్‌మిల్ టెస్ట్ (టీఎంటీ) పరీక్షలను ఏడాదికి ఒకసారి చేయించుకోవాలి. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, ఉబకాయం, మానసిక వత్తిడి, ధూమపానం లాంటి రిస్క్ ఫ్యాక్టర్లు ఉన్నవారు 40 ఏళ్లకు ముందే గుండె పరీక్షలు చేయించుకోవాలి. ఒత్తిడిని వీలైనంతగా తగ్గించుకుంటూ, పొగతాగడం, మద్యం అలవాట్లకు దూరంగా ఉంటాలి. చలికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

● డాక్టర్ విక్రంరెడ్డి, కార్డియోథెరాసిక్ సర్జన్

తారస్థాయిలో ప్రచారం

● ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధికార, ప్రతిపక్షాలు ● ప్రచారంలో పాల్గొంటున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

నల్లగొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికలను అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో రెండు రోజుల క్రితం ప్రచారం నిర్వహించారు. దీంతోపాటు నల్లగొండలో నియోజకవర్గ స్థాయి పార్టీ అభ్యర్థులు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించి గెలుపు వ్యూహాలు సూచించడంతో పాటు, అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. క్యాడర్‌కు ప్రచార బాధ్యతలు అప్పగించిన మంత్రి ఎప్పటికప్పుడు పరిస్థితిని వాకబు చేస్తున్నారని పార్టీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోమవారం నియోజకవర్గంలోని మునుగోడు మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఎంత ముఖ్యమో గ్రామానికి సర్పంచ్ అంతే ముఖ్యమని ఆయన ప్రచార క్షేత్రంలోకి దిగారు. కాంగ్రెస్ బలపరచిన సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మునుగోడు నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థులతో పాటు, కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్న గ్రామాల్లో ప్రచారం నిర్వహించి అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కట్టంగూరు, కేతేపల్లి మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల కోసం ప్రచారం సాగించారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలను కలియదిరుగుతూ విస్తృతంగా ప్రచారం చేస్తుండగా, బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పార్టీ అభ్యర్థుల తరఫున జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నియోజకవర్గంలోని వేములపల్లి మండలంలో కాంగ్రెస్ అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొంటున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల తరుపున మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మిర్యాలగూడ రూరల్ మండలంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నియోజకవర్గంలోని ఆత్మకూరు(ఎం)మండలంలో ప్రచారం చేయగా, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆలేరు మండలంలో, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ తీన్మార్‌మల్లన్న ఆలేరు మండలంలో ప్రచారం సాగించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి భూదాన్‌పోచంపల్లి మండలంలో ప్రచారం సాగించారు. సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఇప్పటికే పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం సాగించారు.

పీఆర్టీయూ సోషల్ మీడియా రాష్ట్ర చైర్మన్‌గా విజయ్‌కుమార్



నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్‌గా చొక్కారపు విజయ్ కుమార్ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుల్లం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయ్ కుమార్ చాలా సంవత్సరాలుగా పీఆర్టీయూకు అందిస్తున్నారని, ఆయన సేవలను గుర్తించి ఈ పదవి ఎంపిక చేసినట్లు వారు తెలిపారు.

వాహనంలో తరలిస్తున్న పశువుల పట్టివేత



కంటైనర్‌లో ఉన్న పశువులు

నల్లగొండ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట నుంచి నల్లగొండ మీదుగా కంటైనర్‌లో తరలిస్తున్న 30గోవులు, ఎద్దులను సోమవారం స్థానికులు పట్టుకున్నారు. అనంతరం నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూకూరి సంపత్‌వర్మ ఆధ్వర్యంలో పలువురు యువకులు కంటైనర్‌ను పట్టుకొని టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు గోవులు, ఎద్దులు ఉన్న కంటైనర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు. ఈ సందర్భంగా సంపత్ వర్మ మాట్లాడుతూ గోవులను, ఎద్దులను తరలించకూడదని చట్టం ఉన్నా కొందరు అక్రమంగా తరలిస్తున్నారని వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట సాయి, సోమేష్ తదితరులు ఉన్నారు.

నకిలీ బంగారంతో అమాయకులకు బురిడీ

● నలుగురు ముఠా సభ్యుల అరెస్ట్ ● రూ.12లక్షల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం ● పరారీలో మరో ఐదుగురు నిందితులు





కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహా, స్వాధీనం చేసుకున్న నగదు

సూర్యాపేట క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారంతో అమాయకులను బురిడీ కొట్టిస్తున్న ముఠాలోని నలుగురిని సూర్యాపేట రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన నాగేశ్వర్‌రావు, మేడి ఆదినారాయణ, యోగిరెడ్డి, పిట్ట నాగిరెడ్డి, శ్రీనివాసరావు, బాల, చంద్ర, ఖమ్మంకు చెందిన సుధాకర్, హుజూర్‌నగర్ మండలం గోవిందాపురానికి చెందిన ఇర్రి నరేష్ ముఠాగా ఏర్పడ్డారు. సుధాకర్ గత నెల 25వ తేదీన నరేష్‌కు ఫోన్ చేసి నాగేశ్వర్‌రావు వద్ద బంగారం బిస్కెట్లు ఉన్నాయని, తులం బంగారం రూ.90వేలకు విక్రయిస్తే పది శాతం కమీషన్ ఇస్తాడని తెలిపాడు. దీంతో సుధాకర్, చంద్ర, ఆదినారాయణ, శ్రీనివాసరావు, నరేష్, మరికొంతమంది బాలెంల గ్రామ శివారులోని నాగేశ్వర్‌రావు ఇంటికి వెళ్లారు. అక్కడ నాగేశ్వర్‌రావుతో పాటు అతడి సోదరుడు బాల ఉన్నారు. 10 నకిలీ బంగారం బిళ్లలు చూపించి ఒక్కొక్కటి 20 గ్రాములు ఉన్నాయని, విక్రయిస్తే పది శాతం కమీషన్ ఇస్తామని నరేష్‌కు చెప్పారు. దీంతో నరేష్ తనకు పరిచయం ఉన్న హన్మకొండకు చెందిన ఆటో డ్రైవర్ కన్నయ్యకు చెప్పాడు. తన ఆటోలో ప్రయాణించే వెంకటేశ్వర్‌రావు, లీలలు బంగారం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపటంతో ఇద్దరూ కలిసి కన్నయ్య ఆటోలో ఈ నెల 6వ తేదీన బాలెంల శివారులోని నాగేశ్వర్‌రావు ఇంటికి వచ్చారు. రూ.12లక్షలు చెల్లించి ఐదు బంగారం బిళ్లలు తీసుకున్నారు. ఆ సమయంలో సుధాకర్, ఆదినారాయణ, శ్రీనివాసరావు, నాగిరెడ్డి, యోగిరెడ్డి, చంద్ర అక్కడే ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో నగదును నరేష్ వద్ద ఉంచారు. ఇంటికి వెళ్లిన వెంకటేశ్వర్‌రావు, లీలలు తాము తీసుకున్నవి నకిలీ బంగారు బిళ్లలని గ్రహించి ఈ నెల 6వ తేదీన సూర్యాపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొనుగోలు చేస్తామని రప్పించి

తమ వద్ద ఉన్న ఐదు బంగారం బిళ్లలు విక్రయిస్తామని నరేష్ హన్మకొండలోని వెంకటేశ్వర్‌రావుకు చెప్పటంతో మరో ఇద్దరితో కలిసి సోమవారం బాలెంలకు వచ్చారు. నరేష్ వద్ద ఉంచిన రూ.12లక్షల నగదును బాలెంల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు తేవాలని నాగేశ్వర్‌రావు సూచించటంతో డబ్బుతో అక్కడికి చేరుకున్నాడు. నాగేశ్వర్‌రావుతో పాటు చంద్ర, ఆదినారాయణ, యోగిరెడ్డి, నాగిరెడ్డి, బాల, శ్రీనివాసరావు, సుధాకర్ కలిసి నరేష్ నుంచి నగదు తీసుకుని వెళ్లే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో సూర్యాపేట రూరల్ పోలీసులను చూసి కొంతమంది పారిపోయారు. మేడి ఆదినారాయణ, యోగిరెడ్డి, నాగిరెడ్డి, నరేష్‌ను పోలీసులు పట్టుకుని విచారించారు. తాము నకిలీ బంగారం బిళ్లలు విక్రయించి డబ్బు సంపాదిస్తున్నామని, ఈ నెల 6వ తేదీన వెంకటేశ్వర్‌రావు, లీల వద్ద రూ.12 లక్షలు తీసుకుని నకిలీ బంగారం ఇచ్చామని అంగీకరించారు. దీంతో పోలీసులు నిందితుల నుంచి రూ.12లక్షల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలో నాగేశ్వర్‌రావు, బాల, సుధాకర్, శ్రీనివాసరావు, చంద్ర పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ గురుకుల రాజశేఖర్, ఎస్ఐ ఎన్. బాలునాయక్, సిబ్బంది సుదర్శన్, చైతన్య, ఉమామహేశ్వర్, సాయిశంకర్ ఉన్నారు.

వ్యక్తి బలవన్మరణం

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి భవనం మీద నుంచి దూకి యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వంగపల్లి గ్రామానికి చెందిన పప్పుల నరేందర్(37) అప్పుల బాధ భరించలేక డిసెంబరు 1వ తేదీన భువనగిరి మండలంలోని ముస్తాలపల్లి గ్రామంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజుల నుంచి చికిత్స పొందుతుండగా గడుపులో నొప్పి భరించలేక ఈ నెల 6వ తేదీ తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో గాంధీ ఆసుపత్రి 3వ అంతస్తునుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని సోమవారం స్వగ్రామం వంగపల్లికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. నరేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

వేపల సింగారంలో కొండచిలువ

హుజూర్‌నగర్, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని వేపల సింగారంలో సోమవారం రాత్రి కొండ చిలువ ప్రత్యక్షమైంది. గ్రామంలోని మూడో వార్డులో గల రైతు దొండపాటి క్రాంతిరెడ్డి ఇంటి నుంచి కొండ చిలువ బయటికి వస్తుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు కొండ చిలువను కొట్టి చంపారు. సుమారు ఐదున్నర అడుగుల బారు ఉన్న కొండ చిలువ గ్రామంలోకి ప్రవేశించింది. గ్రామానికి కొద్ది దూరంలో పంట పొలాలు ఉండగా ఇటీవల వరి కోతలు కోశారు. కాగా వ్యవసాయ పొలాల నుంచి వచ్చిన కొండ చిలువ గ్రామంలోని క్రాంతిరెడ్డి ఇంటి నుంచి రోడ్డు దాటుతుండగా సమయంలో పలువురు యువకులు చూసి కర్రలతో కొట్టి చంపారు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

ధాన్యం తీసుకొని డబ్బులు ఇవ్వడంలేదు

● సూర్యాపేటలో బాధితుల ఆందోళన ● రైస్‌మిల్లులో వ్యాపారులను ఉంచి తాళం ● తాళంతీసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు



రైస్‌మిల్లులో ఆందోళన చేస్తున్న బాధితులు

సూర్యాపేటక్రైం, డిసెంబరు 8,(ఆంధ్రజ్యోతి): తాము విక్రయించిన ధాన్యానికి డబ్బులు చెల్లించడం లేదని ఆరోపిస్తూ బాధితులు ఆందోళనకు దిగారు. వ్యాపారులను రైస్‌మిల్లులో ఉంచి తాళం వేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని శివసాయి రైస్‌మిల్లులో సోమవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి, నేరేడుచర్ల, పెన్‌పహాడ్ మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో 2024 వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని గరిడేపల్లి మండలంలోని శ్రీసంతోషిమాతా పార్‌బాయిల్డ్, నేరేడుచర్ల మండలంలోని వైష్ణవి రైస్ కార్పొరేషన్ మిల్లుల్లో విక్రయించారు. ఆ ధాన్యం విలువ సుమారు రూ.40కోట్లపైన ఉంటుంది. ధాన్యం విక్రయించిన కొన్నాళ్ల వరకు సంబంధిత మిల్లుల యజమాని గౌరు రాజేష్ బాధితులకు డబ్బులు చెల్లించలేదు. గతేడాది డిసెంబరులో సీఎంఆర్ సరఫరా చేయక పోవడంతో అధికారులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేసి మిల్లులను సీజ్ చేశారు. ప్రభుత్వానికి బకాయి ఉన్న సీఎంఆర్‌ను రాబట్టేందుకు ఆర్ఆర్ యాక్టును అమలు చేశారు. దీంతో చేసేది లేక మిల్లుల యజమాని తన పేరున, తన కుటుంబ సభ్యుల పేరున ఉన్న పలు భూములను విక్రయించి కొంత మంది ధాన్యం విక్రయించిన వారికి చెల్లించాడు. ఇంకా సుమారు రూ.పది కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. దీంతో సంబంధిత మిల్లు యజమాని వద్ద కొన్నేళ్ల పాటు అకౌంటెంట్‌గా పనిచేసిన శ్రీకాంత్, మురళీతో కలిసి సూర్యాపేటలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శివసాయి రైస్ మిల్లును లీజుకు తీసుకున్నారు. సంబంధిత మిల్లులో రాజేష్ 50శాతం వాటాగా, మిగిలిన ఇద్దరు వ్యాపారులు కలిసి 50 శాతం వాటాగా మిల్లును లీజుకు తీసుకుని వ్యాపారం చేస్తున్నారు. బాధితులు ఒత్తిడి చేస్తుండడంతో సుమారు రూ.10కోట్ల విలువ చేసే వైష్ణవి రైస్ కార్పొరేషన్‌ను వ్యాపార భాగస్వాములైన మురళీ, శ్రీకాంత్‌లకు విక్రయించాడు. వారిద్దరూ కలిసి బ్యాంక్ ద్వారా రుణం పొంది బాధిత రైతులకు డబ్బులు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. కానీ బ్యాంకు ద్వారా రుణం తీసుకోవడంలో ఆలస్యం కావడంతో డబ్బులు రాక బాధితులకు చెల్లించాల్సిన డబ్బులు పెండింగ్‌లో ఉంచారు. బాధితులు వ్యాపారి రాజేష్ వద్దకు వెళ్లి మాట్లాడినప్పటికీ ప్రయోజనం జరగలేదు. సూర్యాపేటలోని శివసాయి మిల్లుకు నెల రోజుల క్రితం వ్యాపారి రాజేష్‌తో కలిసి వచ్చి మరో ఇద్దరు వ్యాపారులు వారితో మాట్లాడారు. డబ్బులైనా ఇవ్వండి లేనిపక్షంలో నేరేడుచర్లలోని మిల్లును తమ పేరున రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. వ్యాపారి రాజేష్ కూడా తన వ్యాపార భాగస్వాములకు ఈ విషయం చెప్పాడు. వారు నిర్లక్ష్యం చేయడంతో ఆగ్రహంతో రైతులు శివసాయి రైస్‌మిల్లుకు వచ్చారు. ఆ సమయంలో ముగ్గురు వ్యాపారులు మిల్లులో ఉండడంతో వారిని మిల్లులోని కార్యాలయంలో ఉంచి బయట నుంచి తాళం వేశారు. తమ డబ్బుల విషయాన్ని తేల్చే వరకు మిల్లు నుంచి వెళ్లబోమని భీష్మించారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు మిల్లు వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడి తాళం తీసి వ్యాపారులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

పొట్టేలు కడుపులో మొక్కజొన్నలు, పత్తిచెక్క

● శస్త్ర చికిత్సతో పొట్ట నుంచి తొలగింపు



కోదాడలో గొర్రెకు శస్త్ర చికిత్స చేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య

కోదాడ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొట్టలో మొక్కజొన్నలు, పత్తి చెక్క చేరి నడవలేని స్థితికి చేరిన ఓ పొట్టేలుకు సూర్యాపేట జిల్లా కోదాడలోని ప్రాంతీయ పశువైద్యశాలో డైరెక్టర్ పెంటయ్య సోమవారం శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన ఓ రైతు గొర్రెల ఫారం నిర్వహిస్తున్నాడు. షెడ్డులోనే ఉంచి మొక్కజొన్న గింజలు, పత్తి చెక్క, నూకతో మేపుతున్నాడు. బయటి నుంచి తెచ్చిన మొక్కజొన్నలు, నానబెట్టకుండా అలాగే గొర్రెపోతులకు మేపడంతో అవి అరగకుండా పొట్టఉబ్బి కనీసం శ్వాస పీల్చడానికి కూడా ఆపసోపాలు పపడుతూ, నడవలేని స్థితికి చేరాయి. ఇలా ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ గొర్రెను సోమవారం కోదాడలోని ప్రాంతీయ పశువైద్యశాలకు రైతు తీసుకువచ్చాడు. అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య ఆ గొర్రెకు శస్త్ర చికిత్స నిర్వహించి పొట్ట నుంచి సుమారు ఆరు నుంచి ఏడు కిలోల విత్తనాలను బయటికి తీశారు. అనంతరం పెంటయ్య మాట్లాడుతూ గొర్రెల పొట్ట, మనుషుల పొట్ట వేర్వేరుగా ఉంటాయన్నారు. మనుషుల పొట్టల్లో జీర్ణమయ్యే గింజలు, ధాన్యం గొర్రెల పొట్టల్లో జీర్ణం కావన్నారు. గడ్డి, పీచు పదార్థాలతో కూడిన ఆహారం గొర్రెల పొట్టలో ఉన్న సెల్యులేస్ ఎంజైమ్ ద్వారా జీర్ణం అవుతుందని అన్నారు. జీవాల పెంపకందారులు అవగాహన రాహిత్యంతో ఇలా జీర్ణం కాని ధాన్యాలను గొర్రెలకు మేపరాదని సూచించారు. శస్త్ర చికిత్సలో కాపుగల్లు పశు వైద్యాధికారి సురేంద్ర, సిబ్బంది రాజు, చంద్రకళ, అఖిల్, సాగర్, హరికృష్ణ పాల్గొన్నారు.

సెవెంత్ డాన్‌గా సహదేవ్



సినీ నటుడు సుమన్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సహదేవ్

కోదాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మంలో సోమవారం 30వ జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ సహదేవ్ సెవెంత్‌డాన్‌గా నిలిచారు. ఈ సందర్భంగా సహదేవ్‌కు ప్రశంసాపత్రాన్ని సినీ నటుడు సుమన్ అందజేశారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు గాయత్రి



సూర్యాపేట అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన శ్రీలక్ష్మీవెంకటసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఆర్.గాయత్రి ఎంపికైనట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ కారింగుల బాలాగౌడ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)ద్వితీయ సంవత్సరం విద్యార్థిని గాయత్రిని అభినందించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కారింగుల విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ స్వాతి పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు మహేందర్



మహేందర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రవినాయక్

దేవరకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జనవరి 26న జరగనున్న గణతంత్ర వేడుకల కవాతులో పాల్గొనడానికి దేవరకొండ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ ఎటెల్లి మహేందర్ ఎంపికైనట్లు దేవరకొండ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవినాయక్ తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ మహేందర్‌కు శిక్షణ సర్టిఫికెట్‌ను సోమవారం అందజేసి అభినందించి మాట్లాడారు. మహేందర్ తమిళనాడులోని తంజావూర్ యూనివర్సిటీలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ (క్యాంపు)-2025లో పాల్గొన్నట్లు తెలిపారు. దీంతో పాటు భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ రీజినల్ డైరెక్టర్ అహ్మదాబాద్ హేమచంద్రాచార్య నార్త్ గుజరాత్ యునివర్సిటీ సంయుక్తంగా గుజరాత్‌లోని పటాన్‌లో అక్టోబరు 31 నుంచి నవంబరు 9వరకు నిర్వహించిన వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్‌డే పెరేడ్ క్యాంపు 2025లో శిక్షణ పూర్తి చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఢిల్లీ పెరేడ్ గ్రౌండ్ కవాతుకు ఎంపికైన మహేందర్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు మకట్‌లాల్, ఆరీఫా, లింగమయ్య, అధ్యాపకులు అభినందించారు.

పాత కాలం గురుతులు

● జీవనప్రమాణాలు పెంచిన నాటి వస్తువులు
● రోలు, రోకలి, ఇసుర్రాయి, కట్టెపొయ్యితో వంటలు
● తెలియకుండానే మహిళలకు వ్యాయామం
● ప్రస్తుతం మచ్చుకు కూడా కనిపించని వస్తువులు



ఒకప్పుడు మానవ జీవితంలో ముడిపడిన అపురూప సంపద కనుమరుగువుతోంది. నాటి అపురూప వస్తువులకు నేడు కాలం చెల్లిపోతోంది. అవి అక్కడక్కడ కనబడుతున్నా ఇప్పటికీ మానవజీవితంలో వాటి అవసరం మరోసారి గుర్తుచేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పటి రోలు, రోకలి, ఇసురాయి, కట్టెపొయ్యితో మహిళలు శారీరక శ్రమతో వంట చేసుకొని ఆరోగ్యంగా ఉండేవారు. వారికి తెలియకుండానే వ్యాయామం అయ్యేది. జీవనప్రమాణాలు పెంచిన ఆనాటి వస్తువులు మచ్చుకు కూడా కన్పించడం లేదు.

● ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట రూరల్

ఆనాడు ఇంట్లో పిండికావల్సి వస్తే అందుబాటులో ఇసురురాయి ఉండేది. అందులో బియ్యం పోసి ఇసురితే పిండివచ్చేది. ఆ పిండితో రొట్టెలు, సర్వపిండి, దోశలు, అనేక రకమైన పిండి పదార్థాలు తయారు చేసుకుని తింటే ఎంతో రుచిగా ఉండేది. దాంతో పాటుగా జొన్నలు ఇసురాయితో గటుక తయారు చేసుకొని తింటే ఆరోగ్యంగా ఉండేది. రాను రాను పిండి గిర్నీలు, రావడంతో కొంతవరకు శ్రమతప్పింది. నేటి యంత్రాలు తయారు చేస్తున్న కల్తీ పిండితో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి.

రోకలిబండ



50 సంవత్సరాల క్రితం మహిళలు ఇంట్లో పచ్చిమిర్చి కారం, పచ్చళ్ల రోట్లో రోకలితో రుబ్బి తయారు చేసేవారు. అవి ఎంతో



రుచితో పాటుగా ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూర్చేవి. మహిళలకు వ్యాయామం కూడా అయ్యేది.

గావు ప్రయోజనం


పేదవాళ్ల ధాన్యం నిల్వ చేయడానికి గావులు ఉపయోగించేవారు. గావుల్లో ధాన్యం నిల్వచేస్తే ఎలుకలు, పందికొక్కులు, క్రిమికీటకాలు దరి చేరకుండా సురక్షితంగా ఉండేది. గావులో నిల్వచేసిన ధాన్యం ఆరోగ్యానికి మంచిగా ఉండేది. నేడు ధాన్యం నిల్వ చేయడానికి ప్లాస్టిక్ బస్తాలు వాడుతున్నారు. అందులో పురుగులు చేరి అనారోగ్యానికి కారణవుతున్నాయి.

కట్టెల పొయ్యి



ఆనాటి కట్టెల పొయ్యిపై వంటకాలు ప్రత్యేకమైన రుచితో పాటుగా రోగాలను కట్టడి అయ్యేవి. ఆరోగ్యం కాపాడడంలో కట్టెల పొయ్యి కీలకపాత్ర పోషించేది. మహిళలు వంటలు చేసే సమయంలో కట్టెల పొయి వద్ద ఎక్కువ సేపు కూర్చునే క్రమంలో వ్యాయామం అయ్యేది. కాలం మారి వంటగ్యాస్‌లతో రుచి, ఆరోగ్యానికి రక్షణ లేకుండాపోయింది.

కుందెన, కుదురు



ప్రతి ఇంట్లో కుందెన, కుదురు తప్పనిసరిగా అవసరముండేది. కుందెన కుదురుతో రోలులో వడ్లు, జొన్నలు దంచడానికి ఎంతో అవసరం ఉండేది. ఆనాడు రోట్లో రోకలితో వండ్లు దంచి బియ్యం తయారు చేసుకొని వంటచేసుకొనేవారు.

కనుమరుగయ్యాయి



రోలు, రోకలి, ఇసురు రాయి, వడ్లు దంచడం, కట్టెలలో పొయ్యితో వంటలు చేసుకునే వారు. అప్పటి మహిళలకు తెలియకుండానే శారీరక వ్యాయామం జరిగేది. అప్పటి మహిళలంతా నేటికీ ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. పాత వస్తువులు రానురాను కనుమరగవుతున్నాయి. అవినేటి తరానికి తెలియాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

సూదగాని లక్ష్మీనర్సమ్మ, యాదగిరిగుట్ట

శారీరక శ్రమలేకపోవడంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి

ప్రస్తుత తరుణంలో మిక్సీ, వాషింగ్ మిషన్, గ్రాండర్, గ్యాస్‌స్టవ్, పిండిగిర్నీల వస్తువులతో నేటి మహిళలు పనులు నిర్వహించడంతో శారీరకంగా శ్రమలేకపోవడంతో అనారోగ్యాలకు గురవుతున్నారు. శ్రమలేకుండా పనులు చేయడంతో కష్టమంటే తెలియకుండా పనులు చేయడంతో రోగాలు కొని తెచ్చుకుంటున్నారు.

రాయగిరి విజయ, యాదగిరిగుట్ట

శారీరక శ్రమతోనే ఆరోగ్యం



శారీరక శ్రమతో ఆరోగ్యంగా ఉంటారు. నాటి రోజుల్లో నిద్రలేచి ఇంటి ముంగిట చీపుళ్లతో ఊడ్చడం, కలాపి చల్లడం, కట్టెల పొయ్యిపై వంటలు చేయడం, దుస్తులు ఉతక డం, ఇసుపరాయితో పిండి ఇసురడం, రోట్లో పచ్చడి దంచడం వంటివి ఇప్పుడు లేవు. ప్రస్తుతం శ్రమలేని వస్తువులతో పనులు చేసి రోగాలను కొనితెచ్చుకుంటున్నారు.

డాక్టర్ గిరిధర్, యాదగిరిగుట్ట

శివకేశవులకు విశేష పూజలు



శివాలయంలో పూజలు జరుపుతున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై శివకేశవులకు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 29,60,656 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో విశేష అర్చనలు జరిగాయి. ఆలయంలో ప్రాతఃకాలార్చనలు పూర్తయాక అర్చకులు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై అధిష్టింపజేసి విశ్వక్సేనారాధన వేదపండితులు నిర్వహించారు. క్షేత్రంలోని శివాలయంలోనూ బ్రహ్మముహూర్తంలో ఏకాదశ రుద్రాభిషేకం, పంచాయతన పూజలు అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో అజ్మీర జ్యోతి ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటుగా మారాలి



డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ దాసేశ్వర్‌రావు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పుస్తకాలు చదవడం అలవాటుగా మారాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర్‌రావు అన్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామ శివారులోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం డిజిటల్ లైబ్రరీని ఆయన విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. విజ్ఞాన కేంద్రాలైన గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైబ్రరీకి వెళ్లి దినపత్రికలు, రిఫరెన్స్ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. విజ్ఞానాన్ని పెంపొందించుకుని విలువలు గల భావి భారత పౌరులుగా ఎదగాలన్నారు. పాఠ్యపుస్తకాలే కాకుండా వ్యక్తిత్వ వికాసం కోసం అబ్దుల్ కలాం, స్వామి వివేకానంద వంటి మహనీయుల జీవిత చరిత్రలు చదవాలన్నారు. కథలు, కవితలు, వ్యాసాలు చదవడం ద్వారా సృజనాత్మకత, ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. గ్రంథాలయాలు విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందిస్తాయని, వివిధ విషయాలపై సమగ్ర జ్ఞానాన్ని అందిస్తాయని అన్నారు. నేటితరం విద్యార్థులు పుస్తకాలతోపాటు ఆడియో విజువల్ కంటెంట్, యూట్యూబ్ పాఠాలు, ఇ-పుస్తకాలు వంటి డిజిటల్ వనరులను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీలో డిజిటల్ లైబ్రరీని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు తమ కెరీర్‌లో ఉన్నత స్థాయిలకు ఎదగడంతోపాటు మంచి విలువలు పాటించాలంటే ఉత్తమ పుస్తకాలు చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఖు'షీ'

(5వ పేజీ తరువాయి)

అత్యధికంగా మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకుంటున్నారు. కొంతమంది మహిళలు నిత్యం యాదాద్రి జిల్లా నుంచి హైదరాబాద్‌కు వెళ్లి పూలు, పండ్లు, దుస్తులు, కూరగాయాలు తీసుకెళ్లి విక్రయించి కుటుంబాలను పోషిస్తున్నారు. ఉచిత ప్రయాణంతో వారికి బస్సు చార్జీలు ఆదా అవుతున్నాయి.

రెండేళ్లలో 12కోట్ల మందికి పైగా

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో మహిళలు ఈ రెండేళ్లలో పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. దేవరకొండ, కోదాడ, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి, సూర్యాపేట, యాదగిరిగుట్ట డిపోల పరిధిలో సుమారు 640 బస్సులున్నాయి. మహిళలు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే ప్రయాణించే అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 12.35కోట్ల మందికి పైగా మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. సగటున ప్రతీరోజు 36.70లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు.మహిళలకు రూ.620.13 కోట్లు ఆదా అయ్యాయి. యాదాద్రి జిల్లాలో ఇప్పటి వరకు 1.23కోట్ల మంది మహిళలు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకోగా, రూ.95కోట్ల వారికి ఆదా అయ్యాయి.

రద్దీకి అనుగుణంగా పెరగని బస్సు సర్వీసులు

మహాలక్ష్మి పథకంతో మహిళలు ఎంత ఆనందంగా ఉన్నారో అంతే సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారు. బస్సుల సంఖ్య తగ్గడం, పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులను ఆయా రూట్లలో నడపకపోవడంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ఉచిత బస్సులైన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో మహిళలు అధికంగా ప్రయాణిస్తున్నారు. అయితే రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో మహిళలకు సైతం సీట్లు దొరకని పరిస్థితులు ఉన్నాయి. అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చాలా గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు వెళ్లడంలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. అదేవిధంగా కొన్ని రూట్లలోని బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణిస్తుండటంతో అధిక లోడ్‌తో బస్సులు మరమ్మతులకు గురవుతున్న సందర్భాలు చాలా ఉన్నాయి. అంతేగాక సీట్ల కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా వృద్ధులు, దివ్యాంగులకు సీట్లు దొరక్క ఇక్కట్లుపడుతున్నారు. మహాలక్ష్మి పథకంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూనే రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

డబ్బు ఆదా అవుతోంది



మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు వేల రూపాయలు ఆదా అవుతున్నాయి. ప్రతీ రోజు హైదరాబాద్ పూల మార్కెట్‌కు వెళ్లి అక్కడ పూలు, పండ్లు కొనుగోలు చేసి గుట్టలో విక్రయిస్తున్నా. దీంతో రవాణా ఖర్చులు తగ్గి కుటుంబానికి ఆదాయం సమకూరుతోంది. మహాలక్ష్మి పథకం మహిళలకు వరం.

బూడిద స్రవంతి, యాదగిరిగుట్ట

పురుషులకు సీట్లు కేటాయిస్తే మంచిది



మహిళలకు ఉచిత ప్రయాణం మంచిదే అయినా, వారికి కేటాయించిన సీట్లను మాత్రమే వారికి రిజర్వ్ చేయాలి. డబ్బు చెల్లించి ప్రయాణం చేసే పురుషులకు సీట్లు లేక పలు ఇబ్బందులు పడుతున్నారు. సీట్ల కోసం మహిళలు గొడవలకు పాల్పడుతున్నారు. వారిని వారి సీట్లకే పరిమితం చేసి పురుషుల ఇబ్బందులను తొలించాలి. లేకుంటే అదనంగా బస్సుల సంఖ్య పెంచాలి. అప్పుడు ఇబ్బందులు ఉండవు.

ముక్కెర్ల కొమురయ్య, యాదగిరిగుట్ట

సారథితో సమస్యలు

● నెలకు మూడు నాలుగు రోజులు పని చేయని సర్వర్
● గంటల కొద్ది క్యూలో నిలుచుంటున్న ప్రజలు

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ)

లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్‌లను సులభతరంగా పొందేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సారథి అప్లికేషన్‌లో తరుచుగా సమస్యలు రావడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.. నెలకు రెండు, మూడు రోజులపాటు సర్వర్ ఓపెన్ కానందున దేశవ్యాప్తంగావినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. సేవలు సులభతరం అవుతాయని ఆశిస్తే సాంకేతిక లోపంతో ఎంవీఐ కార్యాలయంలో గంటల పాటు క్యూలో నిలబడటంతో సమయం వృథా అవుతుందని ప్రజలు అంటున్నారు.

వాహన రిజిస్ట్రేషన్ పర్మిట్, పన్ను విధింపు, ఫిట్‌నెస్, మోటార్ డ్రైవింగ్ స్కూల్స్, లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర సేవలను పరివాహన్ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. జాతీయ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ నేతృత్వంలో పోర్టల్‌లోని వాహన్, సారథి అప్లికేషన్‌ల ద్వారా డిజిటల్ సేవలు అందించే ప్రక్రియ కొనసాగుతోంది. పరివాహన్ పోర్టల్ ద్వారా వాహన సర్టిఫికెట్స్ చూసుకునేందుకు, ఆర్సీ పొందడం, డ్రైవింగ్ లైసెన్స్ సేవలు పొందడం, ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన చలాన్లను చెల్లించడం వంటి వాటికి అవకాశం కల్పించింది. 2006లో జాతీయ ఈ-గవర్నెన్స్ ప్రోగాం కింద దీనిని చేపట్టినప్పటికీ నల్లగొండ జిల్లాలో ఇటీవలే సారథి అప్లికేషన్‌ను అమలు చేస్తుండగా సాంకేతిక కారణాలతో 'వాహన్' పూర్తి స్థాయిలో అమలుకావడం లేదు.

పరివాహన్ పోర్టల్‌తో డిజిటల్ సేవలు

ఏకీకృత జాతీయ రవాణా వ్యవస్థలో భాగంగా చేపట్టిన పరివాహన్ ద్వారా వాహన యజమానులకు, డ్రైవర్లకు సులభంగా సేవలు పొందవచ్చని అంటున్నారు. పరివాహన్ పోర్టల్‌లోని సారథి, వాహన్ అప్లికేషన్స్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు, వాహన వివరాలు, రిజిస్ట్రేషన్స్ సమాచారం, అనుమతులకు సంబంధించిన సమాచార సేవలతో పాటు వాహన సంబంధిత సేవలు, డ్రైవింగ్ లైసెన్స్, ట్యాక్స్ తనిఖీ, ఫ్యాన్సీ నెంబర్ బుకింగ్, నేషనల్ రిజిస్టర్ సేవలు, హోమోలోగేషన్, జాతీయ పర్మిట్, ఆలిండియా టూరిస్ట్ పర్మిట్, సీఎన్‌జీ తయారీదారు, వేగపరిమితి పరికరం తయారీదారు, ట్రేడ్ సర్టిఫికెట్ తదితర ఆన్‌లైన్ సేవలు పొందే అవకాశం కల్పించినట్లు రవాణా శాఖ అధికారులు అంటున్నారు. ఉపాధి కోసం, వివిధ కారణాల రీత్యా బయట రాష్ట్రాకు వెళ్లినవారు, ఇతర రాష్ట్రా నుంచి మన రాష్ట్రంలోకి వచ్చినవారు ఈ-పోర్టల్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు, చిరునామా మార్పులు, చేర్పులు, లైసెన్స్ బదిలీ వంటి సేవలను సులభంగా పొందవచ్చు.



సారథి సర్వర్ పనిచేయనందున లైసెన్స్‌ల కోసం మిర్యాలగూడ ఎంవీఐ కార్యాలయం ఎదుట బారులు తీరిన వినియోగదారులు

సారథితో వేగవంతమైన సమాచారం

ప్రభుత్వం రెండవ విడతలో నల్లగొండ జిల్లాలో సారథి అప్లికేషన్ ద్వారా సేవలు పొందేందుకు అవకాశం కల్పించింది. గత నెల ఆగస్టు 25 నుంచి నల్లగొండ, మిర్యాలగూడ రవాణాశాఖ కార్యాలయాలతో పాటు రాష్ట్రంలోని మరో 10 కార్యాలయాల్లో సారథి సాఫ్ట్‌వేర్‌ను వినియోగించాలని ఆదేశాలు జారీ చేసింది. గతంలో స్టేట్ పోర్టల్ సీఎఫ్‌ఎస్‌టీ సాంకేతికతకు బదులుగా నేషనల్ ఇన్ఫర్‌మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ)సాఫ్ట్‌వేర్‌ను వినియోగించాలని సూచించింది. దీనిద్వారా ఆర్టీవోల పని వాతావరణాన్ని మెరుగుపరచడం, పౌరులకు మెరుగైన సేవలు అందించడం, ఇతర ప్రభుత్వ విభాగాలతో డ్రైవింగ్ లైసెన్స్, వాహన సమాచారాన్ని త్వరగా చేరవేయడం చేయడానికి వీలువుతుందని సంబంధిత అధికారులు అభిప్రాయ పడుతున్నారు. సారథి డ్రైవింగ్ లైసెన్స్‌ల సమాచారం పొందేందుకు లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్‌ను ఎంవీఐ కార్యాలయానికి వెళ్లకుండానే యాప్ ద్వారా పొందే వీలు కలిగిస్తుందని అంటున్నారు. పేపర్ వినియోగాన్ని తగ్గిస్తూ, వేగవంతమైన అప్‌డేట్‌లతో పాటు డిజిటల్ యాక్సెస్ ద్వారా పారదర్శకతను పెంచుతుందని అంటున్నారు. స్లాట్‌లను బుక్ చేసుకోవడానికి, ట్యాక్స్‌లను ఆన్‌లైన్‌లో చెల్లించడానికి వీలు కల్పిస్తుందని అంటున్నారు. కాగా రావాణా శాఖ ఎన్‌ఐసీ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు పొందుపరుస్తున్నప్పటికీ సేవలను అందుబాటులోకి తేవడం లేదని ఆరోపిస్తున్నారు.



సారథి పరివాహన్ లోగో

సాంకేతిక సమస్యలతో సతమతం

సారథి అప్లికేషన్ వినియోగంలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలతో సర్వర్ డౌన్ అవుతుందని అంటున్నారు. వారానికి ఒకసారి టెక్నికల్ సమస్యతో సర్టిఫికెట్లు అప్‌లోడ్ కాకపోవడం, ఆన్‌లైన్‌లో వివిధ రకాలుగా ఎర్రర్ గుర్తులను చూపిస్తోందని అంటున్నారు. పత్రాలు డౌన్ లోడ్ కాకకుండా మొరాయిస్తోందని అంటున్నారు. వారం, 10రోజుల పాటు సారథి సేవలను పూర్తి స్థాయిలో నిలిపివేసి, సాంకేతికతను మెరుగు పరిచిన తర్వాత అందుబాటులోకి తెస్తే మేలని వినియోగదారులు అంటున్నారు.

కాలయాపన జరగకుండా చూస్తాం



డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం కార్యాలయానికి వచ్చిన వినియోగదారులు సర్వర్ పనిచేయని సమయాల్లో ఇబ్బందులకు గురవుతున్నారు. నెలలో రెండు, మూడు రోజులు దేశ వ్యాప్తంగా టెక్నికల్ సమస్య తలెత్తుందని అంటున్నారు. సాధ్యమైనంత వరకు వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం. త్వరలోనే సమస్య క్లియర్ అయ్యే ఆవకాశం ఉంది. వాహనదారులకు కాలయాపన జరగకుండా చూస్తాం.

● చంద్రశేఖర్, ఎంవీఐ, మిర్యాలగూడ

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, AZHARUDDIN (GIVEN NAME) AND MOHAMMED (SURNAME)HOLDER OF PASSPORT No.N2076711, ISSUED AT HYDERABAD ON 02/09/2015 RESIDING AT WARD 23, HYDERKHANGUDA, PO: NALGONDA, DIST: NALGONDA, TELANGANA, 508001. I HAVE CHANGED MY NAME TO AZHARUDDIN (GIVEN NAME) MOHD (SURNAME) FOR ALL OFFICIAL AND LEGAL PURPOSES.

AJY_

4 Lines CLASSIFIED
NLG+SRPT+YGT (3Dist)
210/-Only
Extra Line 45/- Only
For Ads Contact :
NALGONDA DIST 9985413656 9985413365
SURYAPET DIST 9703618713, 9985401015
YADADRI BHONGIRI DIST 8885995946

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మర్రిగూడెంలో ఒక్క వార్డు కోసం ఎన్నికలు

తిప్పర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో ఒక్క వార్డు కోసం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తిప్పర్తి మండల పరిధిలోని మర్రిగూడెం గ్రామంలో మొదటి విడత సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్ అభ్యర్థిని ఏకగ్రీవం చేశారు. గ్రామంలో 8వార్డులు ఉండగా 7 వార్డుల సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించుకొని వారి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. కానీ 2వ వార్డు సభ్యుడు మాత్రం ఉపసంహరణకు తిరస్కరించాడు. దీంతో ఈ నెల 11వ తేదీన గ్రామంలో ఆ ఒక్క వార్డుకే ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుధాకర్ తెలిపారు.

అయ్యప్పల నగర సంకీర్తన

నార్కట్‌పల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవ మండల పూజా మహోత్సవంలో భాగంగా సోమవారం నార్కట్‌పల్లి పట్టణంలో అయ్యప్ప స్వాములు నగర సంకీర్తన చేశారు. బస్టాండ్ వెనుక ఉన్న శివాలయం నుంచి అయ్యప్ప ఉత్సవమూర్తిని గురుస్వామి పెండోట సోమయ్య శిరస్సున ఎత్తుకున్నారు. పదునెట్టాంబడిపై పూజలందుకునే ద్రవ్యాలు, వస్తువులను మాలధారులు సన్నాయి వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లారు. స్వాముల పేటతుళ్లి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవంలో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, హోమాలను నిర్వహించారు. మధ్యాహ్నం గనగాని నర్సింహ, సోమ సుఖేందర్‌రెడ్డి దాతలుగా స్వాములకు బిక్షప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, గురుస్వామి బెల్లి వెంకన్న, ఆలయ అర్చకుడు నాగేశ్వర్‌శర్మ, ధర్మకర్తలు యాద వెంకన్న, గడ్డం శివరాంకుమార్, పుల్లెంల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు ఐతరాజు యాదయ్య, రాపర్తి మోహన్, బాలరాజు, పల్లె తిరుమల్, సైదులు, శ్యాంసుందర్‌రెడ్డి, నాగరాజు, సాయి, అఖిల్, సుబ్రహ్మణ్యం, నాగరాజు, శ్రవణ్ పాల్గొన్నారు.

వలస ఓటర్ల కోసం నాయకుల పట్నం బాట

● *పోలింగ్‌కు రప్పించేందుకు రాను పోను ఖర్చుల అందజేత*



శాలిగౌరారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యులు తమ గెలుపుకోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు ఉపాధి కోసం ఇతర గ్రామాలు, హైదరాబాద్, ముంబాయి, చెన్నై తదితర పట్టణాలకు వెళ్లారు. వారిని రప్పించుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వారి ఫోన్ నెంబర్లు తీసుకొని మేము పోటీ చేస్తున్నాం.. మీ ఓటు నాకే వేయాలి.. ఖర్చులకు డబ్బులిస్తాం అని ఇప్పటికే సమాచారం అందించారు. వాట్సాప్‌లో తమ గుర్తులను తెలియజేస్తున్నారు. మొదటి విడత పోలింగ్ ఈ నెల 11న ఉండటంతో అభ్యర్థులు, వారి బంధువులు, అనుచరులు పట్టణాల బాట పట్టారు. వారి వద్దకు వెళ్లి నేను ఫలానా వార్డులో పోటీ చేస్తున్నాను, నాకు ఓటేయ్యండి అని అవసరమైన బస్సు చార్జీలు, ఇతర ఖర్చులు భరించేందుకు సిద్ధమయ్యారు. అంతేకాకుండా తమకు ఓటు వేసే లా వారి నుంచి మాట కూడా తీసుకుంటున్నట్లు తెలిసింది. ఎందుకంటే ఈ గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రతీ ఓటుతో పాటు, వలస ఓట్లు కూడా కీలకం కానున్నారు. కొంత మంది అభ్యర్థులు వీరి కోసం పట్టణాల్లో మకాం వేశారు. అక్కడ వారికి విందులు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఓటర్లకు ముందుగానే ఖర్చులు, చార్జీలు చెల్లిస్తున్నట్లు తెలిసింది. కొంతమంది అభ్యర్థులు వలస ఓటర్లను పోలింగ్ దగ్గరికి తీసుకువచ్చేందుకు ప్రత్యేకంగా మినీ బస్సులను, వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను పదే పదే చెప్పి తప్పక ఓటు వేసి గెలిపించాలని ప్రాధేయపడుతున్నారు.

శాలిగౌరారంలో సర్పంచ్, 18 వార్డులు ఏకగ్రీవం

శాలిగౌరారం: శాలిగౌరారం మండలంలో 24 గ్రామ పంచాయతీలు, 230 వార్డులు ఉన్నాయి. వాటిలో శాలిగౌరారం సర్పంచ్, 18 వార్డు సభ్యులు ఏకగ్రీమయ్యాయి. మిగతా 23సర్పంచ్ పదవులకు గాను 72మంది పోటీ పడుతుండగా 212 వార్డులకు 482 మంది వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడత ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లతో పాటు సామగ్రి మండలానికి చేరుకుంది.

పల్లెల్లో ఊపందుకున్న ఎన్నికల సందడి

మర్రిగూడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల పోరు పల్లెల్లో ఊపందుకుంది. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం పూర్తయి అభ్యర్థుల చేతికి గుర్తులు రావడంతో గ్రామాల్లో అసలు సిసలైన పండుగ వాతావరణం నెలకొంది. అభ్యర్థులు గెలుపు కోసం ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి తనదైన శైలిలో ఒకరి మించి ఒకరు నానాతంటాలు పడుతున్నారు. అభ్యర్థులు మందు విందులతో ఓటర్లను ముంచెత్తుతున్నారు. అంతేకాక ఓటర్లకు నోటుతో గాలం వేస్తున్నారు. అభ్యర్థులు ఓటర్లకు నేరుగా డబ్బులు పంపిణీ చేస్తే ఎన్నికల అధికారులకు దొరుకుతామనే భయంతో తన బంధుమిత్రుల ఫోన్ ద్వారా పంపిణీ చేయడానికి డిజిటల్ ప్లాట్‌ఫాంను ఎంచుకున్నారు. గ్రామాల్లో వలస ఓటర్లు కీలకం కానున్నారు. దీంతో సర్పంచ్ బరిలో ఉన్న అభ్యర్థులు వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్‌లో ఉంటున్న వారిని గుర్తించి ఓటు వేయించుకోవడానికి మీ రాకపోకలకు ఇతర వసతులు మేమే ఖర్చులు భరిస్తామని, మీరు వచ్చి మాకే ఓటేయ్యాలని అ భ్యర్థులు అభ్యర్థిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఏ గ్రామంలో చూసినా పండుగ వాతావరణం కనిపిస్తుంది.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు

పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కె.శివరాంరెడ్డి

తిప్పర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి హెచ్చరించారు. తిప్పర్తి మండల కేంద్రంలో అన్ని పార్టీలకు చెందిన పార్టీ నాయకులు, అభ్యర్థులను సోమవారం సమావేశపరిచి ఎన్నికల నియమావళి గురించి వివరించారు. అదే విధంగా తమ ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి.శంకర్, ఏఎస్ఐ రాంమూర్తి, సిబ్బంది రాంరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : సీఐ

నల్లగొండరూరల్: ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని సీఐ రాఘవరావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో యువత, గ్రామస్థులు ఎలాంటి వివాదాలకు వెళ్లవద్దని సూచించారు.


ఓటింగ్ రోజున, ఓటు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలలో ఉంటుందన్నారు. ఎలక్షన్ ఫలితాలు వచ్చినప్పుడు శాంతియుతంగా సంబురాలు నిర్వహించుకోవాలని ర్యాలీ, ఊరేగింపులు, బాంబులు పేల్చడానికి అనుమతి లేదన్నారు. ఎన్నికల ఫలితాల్లో ఏమైనా సమస్యలు ఉంటే అక్కడ ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది, గ్రామ యూత్ నాయకులు బల్లెం ప్రవీణ్‌కుమార్, ఇతరులు పాల్గొన్నారు.

పంచాయతీ 'కిక్కు'

» గ్రామాలకు చేరిన ఎన్నికల మద్యం

» ప్రలోభాలు షురూ చేసిన అభ్యర్థులు

» పోలింగ్ వరకు నిషాలో ఉంచేందుకు ప్లాన్



చండూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పల్లె పోరులో గెలుపే అంతిమ లక్ష్యంగా అభ్యర్థులు ప్రలోభాలు షురూ చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనే ప్లాన్‌తో ఉన్న లీడర్లు లిక్కర్ కొనుగోళ్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎన్నికల ఖర్చుకు పెట్టిన డబ్బులో ఎక్కువ భాగం మద్యానికే వెచ్చిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పంచాయతీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం విక్రయాలు చేస్తున్నారు. అభ్యర్థులు కొనుగోలు చేసిన సీసాలు ఎక్కడ నిల్వ చేశామనే లీకులు ప్రత్యర్థులకు తెలియకుండా జాగ్రత్తలు పడుతున్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, పోటీలో నిలిచిన సర్పంచ్, వార్డు సభ్యులు ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి సకల ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో ఏకంగా తెల్లవారకముందే తమ కార్యకర్తలతో పాటు ఇతరులకు మద్యం దార పోస్తున్నారు. గొలుసు దుకాణాల్లో మద్యం డంపులనే ఏర్పాటు చేస్తున్నారు.

మందు పోయండి.. మంచింగ్ ఇవ్వండి

ఓటర్లను సంతృప్తిపరిచేందుకు కొందరు అభ్యర్థులు కొన్ని గ్రామాల్లో బెల్టు దుకాణాలను సైతం గంపగుత్తగా తీసుకున్నట్లుగా విశ్వసనీయ స మాచారం. రోజూ తమకు చెందిన వారు పదుల సంఖ్యలో ఓటర్లు వస్తా రు ఒక్కొక్కరికి మూడు పెగ్గులు పోయండి... దాంతో మంచింగ్ ఇవ్వండి అని సూచిస్తున్నారు. వీలును బట్టి రోజుకో సారి బెల్టు దుకాణానికి వెళ్లి మద్యం తాగవచ్చనే అభిప్రాయాన్ని ఓటర్లకు నిర్దేశించారు. వాయిదా పద్ధతి లో మద్యం డబ్బులు చెల్లిస్తామని, ముందుగా కొంత అడ్వాన్స్ ఇచ్చి ఆర్డర్ ఇస్తున్నారట.

ఓటర్లను ఖుషీ చేసుకునేందుకు...

ఎన్నికల్లో పోటీ చేస్తే అభ్యర్థులు ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు మద్యం, మాంసం సరఫరా చేస్తున్నారు. కుల సంఘాలు, యువజన సంఘాలకు చెందిన వారి స్థాయి పలుకుబడి ఉన్న లీడర్లకు ఖరీదైన బ్రాండ్ల మద్యం బాటిల్లు ఇస్తున్నారు. పోలింగ్ రెండు రోజులే ఉండటంతో మేక, గొర్రె పోతులు, చికెన్ అందించి ప్రతీ కుటుంబంలో ఉన్న ఓటర్‌ను ఖుషీ చేయడం తమకు తప్పదనే ఆలోచనతో అభ్యర్థులు ఉన్నారు.

అడిగేవారేరీ... పట్టించుకునే వారేరీ...

ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇదే అదునుగా భావిస్తూ ప్రతీ గల్లీలో ఓటర్లకి ఒకే చోట బహిరంగంగా మద్యం పోస్తున్నారు. ఫూటుగా తాగిన కొందరు వ్యక్తుల వల్ల సమీప ఇళ్లలో ఉంటున్న ప్రజలు ఎటూ చెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్యానికి బానిసైన వారు తెల్లవారకముందే మత్తు కోసం బెల్టు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న బెల్టు షాపు దుకాణదారులు ఎమ్మార్పీ ధర కన్నా బీరుకు రూ.50, క్వార్టర్‌పై రూ.20లు బ్రాండ్‌ను బట్టి అదనంగా తీసుకుంటున్నారు. గొలుసు దుకాణాల నిర్వాహకులు అధికారులకు నెలవారీగా మామూళ్లు సమర్పించుకోవడంతో, ఈ దందాలపై చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయినా ప్రభుత్వం అనుమతి తీసుకున్న షాపుల్లో పర్మిట్ రూమ్‌లు లేక, కొన్ని గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం పంపిణీ, కల్తీ మద్యం రవాణాలపై నిఘా పెంచాం. స్థానిక పోలీసులతో కలిసి తనిఖీలు చేస్తున్నాం. అక్రమ మద్యం విక్రయిస్తున్న గొలుసు దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారించాం. గుడుంబా, గొలుసు దుకాణాల నిర్వాహకుల సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

- కుర్మానాయక్, ఎస్ఐ, ఎక్సైజ్ శాఖ

మునుగోడును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● *ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి*



పుల్లెంల గ్రామంలో ఫుట్‌బాల్ గుర్తును చూపిస్తూ అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

గట్టుప్పల, చండూరురూరల్, మునుగోడు రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని పలు మండలాల్లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను స ర్పంచులుగా గెలిపించాల్సిన బాధ్యత ప్రజలదేనని, నియోజకవర్గ అభివృద్ధి చే యాల్సిన బాధ్యత నాది అని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గట్టుప్పల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త మండల కేంద్రంగా ఏర్పడిన గట్టుప్పలలో ఎన్నో అభివృద్ధి పనులు చేసుకోవాల్సి ఉందని అన్నారు. నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ సమష్టిగా కష్టపడి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులను గెలిపించుకుని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాధం, నాయకులు వీరమల్ల శ్రీశైలం, రాజశేఖర్, శంకరయ్య, శ్రవణ్, ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

ప్రతి పల్లెలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరు మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుల్లెంల గ్రామంలో మహిళలు ఆయనకు బొట్టుపెట్టి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిత్రపక్షం సీపీఐ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఫుట్‌బాల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో ప్రజలకు ఫుట్‌బాల్ చూపించి ఓటు అభ్యర్థించారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని అన్నారు. ప్రజలంతా ఏకమై కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

● మునుగోడు మండలంలోని సింగారం ఉకొండి, పులిపలుపుల, కొరటికల్ గ్రా మాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు అభ్యర్థుల గుర్తులపై ఓటేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. గతంలో రేషన్ బియ్యం తినలేక అమ్ముకునే వారిని ఇప్పుడు ప్రతీ ఒక్కరూ రేషన్ ద్వారా ఇచ్చే సన్నబియ్యాన్ని వండుకొని తింటున్నారని పేర్కొన్నారు. బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకొచ్చే ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి కష్టాలు లేకుండా చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో నల్లగొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, మాజీ ఎంపీపీ మేడి నాగలక్ష్మి, యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు పాల్గొన్నారు.

నిజాయితీగా ఉండేవారిని ఎన్నుకోవాలి

● *నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం*



కట్టంగూరులో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో నీతి, నిజాయితీగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసే వారికి ఓటేసి ఎన్నుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఓటర్లను కోరారు. ఆయన సోమవారం కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో సుడిగాలి పర్యటనతో పంచాయతీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇళ్లు అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ నిధులతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతమవుతాయన్నారు. గత పదేళ్లలో అధ్వాన్నంగా మారిన గ్రామీణ రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల, మార్కెట్ డైరెక్టర్లు ఎస్‌కె.లతీఫ్, బయ్య ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, కాంగ్రెస్, సీపీఎం నాయకులు మట్టి సాల్మన్, ఎం.కరుణాకర్‌రెడ్డి, ఏళ్ల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

గుడివాడలో కాంగ్రెస్‌లో చేరికలు: ఎన్నికల ప్రచారం సందర్భంగా మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఎమ్మెల్యే వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే వీరేశం కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ యువజన నాయకులు గ్యార తిరుమలేష్, గ్యార వినయ్, చంటి, రమేష్, గ్యార రేణుక, కత్తుల జానమ్మ, గుండ్లపల్లి సైదులు, ధనమ్మ, రాధిక, సూరారపు నాగరాజు, మహేశ్వరి, చింత శ్రీను, చందుపట్ల వెంకటేష్, శ్రీను, ఎస్.శంకర్ ఉన్నారు.

కట్టంగూరు: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సోమవారం మండలంలోని కట్టంగూరు, ఐటిపాముల, ఈదులూరు, బొల్లేపల్లి, చెరువు అన్నారం, కురుమర్తి, మునుకుంట్ల తదితర గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచులుగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిచే విధంగా చూడాలని ఓటర్లను కోరారు. ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కట్టంగూరును ఆదర్శ గ్రామపంచాయతీగా అన్ని సౌకర్యాలు ఉన్న మండల కేంద్రంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, సర్పంచ్ అభ్యర్థులు బుచ్చాల నాగమ్మ, పెద్ది యాదగిరి, అయితగోని విజయలక్ష్మి, బెజవాడ సైదులు, కుంభం అనిల్ రెడ్డి, ఎడ్ల పద్మ, మండడి సునీత, దార సత్తెమ్మ, కత్తుల రేణుక, గొల్లి నరేష్, కొలిపాక సురేందర్, నాయకులు గద్దపాటి దానయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, మిట్టపల్లి శివశంకర్, బూరుగు శ్రీను నరసింహ, దోమల శ్రీశైలం పాల్గొన్నారు.

రేపటి వరకు పోస్టల్ బ్యాలెట్ స్వీకరణ

నార్కట్‌పల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌ను ఈ నెల 10వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో కత్తురోజు ఉమేష్‌చారి తెలిపారు. ఎన్నికల డ్యూటీ ఆర్డర్ కాపీ, గుర్తింపు కార్డుతో మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించి పోస్టల్ బ్యాలెట్‌ను తీసుకుని 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పోస్టల్ బ్యాలెట్‌ను వేయవచ్చని చెప్పారు.

పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటే సస్పెండ్ చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న రాంరెడ్డి

తిప్పర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని తిప్పర్తి మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జూకూరి రమేష్ అన్నారు. సోమవారం తిప్పర్తి మండలంలోని జంగారెడ్డిగూడెం, గడ్డికొండారం, పజ్జూరు, ఎర్రగడ్డలగూడెం గ్రామాలలో పార్టీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో మండల కమిటీ తీర్మానించిన ప్రకారం అభ్యర్థులను ఖరారు చేశామని, ఈ నిర్ణయాన్ని తిరస్కరించి పార్టీకి వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, నాయకులు వనపర్తి అంజయ్య, దాసరి జానయ్య, రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలి

శాలిగౌరారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలో కాంగ్రెస్ సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను అత్యధిక స్థానాలను గెలిపించడానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు సూచించిన అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త సమన్వయంగా పనిచేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసే ప్రతీ కార్యకర్తను భవిష్యత్తులో గుర్తిస్తుందన్నారు. నాయకులు ఇంటింటికి తిరిగి అభ్యర్థుల గుర్తులను చూపెట్టాలని కోరారు.

పౌష్టికాహారాన్ని అందించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న సీడీపీవో నిర్మల

నల్లగొండరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహన్ని అందజేయాలని ఐసీడీఎస్ సీడీపీవో నిర్మల అన్నారు. సోమవారం మండలంలోని అప్పాజీపేట రెండో సెంటర్‌ను ఆమె సందర్శించారు. కేంద్రం ద్వారా మహిళలకు, పిల్లలకు అందించే పథకాలు, పోషకాహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రేణుక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేవారిని సర్పంచులుగా గెలిపించాలి

● *కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి నేతకాని కృష్ణయ్య మద్దతుగా ఎమ్మెల్యే వీరేశం ప్రచారం*



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం,కృష్ణయ్య

నార్కట్‌పల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి చేసే వారిని సర్పంచులుగా ఎన్నుకోవాలని వేముల వీరేశం అన్నారు. చెర్వుగట్టులోని పలు వార్డుల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి నేతకాని కృష్ణయ్య మాట్లాడుతూ మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం సహకారంతో చెర్వుగట్టు గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతానని అన్నారు. చెర్వుగట్టులోని పలు వార్డుల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ వార్డులో వీధి లైట్లు, మురికికాల్వలు, సీసీ రోడ్లు, తాగునీటి కుళాయిలు వేయిస్తానని హామీ ఇచ్చారు. తన లేడీపర్సు గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని కృష్ణయ్య ఓటర్లను అభ్యర్థించారు. తనతో పాటు తన పానెల్‌లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ బలపరిచిన వార్డుసభ్యులను కూడా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రేగట్టి రాజశేఖర్ రెడ్డి, పున్నంరాజు యాదగిరి, రేగట్టి నవీన్‌రెడ్డి, వారాల రమేష్, రేగట్టి నర్సిరెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి, కూకుట్ల గణేష్, దొడ్డి యాదయ్య, మల్ల శంకర్, గంట శేఖర్, కూకుట్ల చంద్రయ్య, దొడ్డి కుమార్, వెంకట్‌రెడ్డి, వేణు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు



నాంపల్లి నుంచి చండూరుకు వెళ్లే దారిలో గుంతలమయంగా ఉన్న రోడ్డు

నాంపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాంపల్లి గాంధీజీ పాఠశాల ఎదుట చండూరుకు వెళ్లే రోడ్డు మార్గంలో రహదారి నరకప్రాయంగా మారింది. మండల కేంద్రంలో తారురోడ్లపై బీటీలేచి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో తరచు ఈమార్గంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులో

ఉండే వారిని ఆదరించాలి


మునుగోడు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్న వారిని గెలిపించాలని ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మునుగోడు మండలంలోని చొల్లేడు గ్రామంలో సీపీఐ బలపరుస్తున్న అభ్యర్థిని గెలిపించాలంటూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, అలాంటి ఓటును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకుని గ్రామ అభివృద్ధికి తోడ్పడే వారిని, ప్రజా సమస్యలు తెలిసిన నిత్యం ప్రజల మధ్యన ఉండే వ్యక్తులకు గ్రామ ప్రజలంతా అండగా నిలబడి కలిసి గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వనం నిర్మలయాదయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు పెంబల్ల జానయ్య, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు వనం వెంకన్న, రుద్రయ్య, వెంకన్న, నరసింహ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో..
'ఆంధ్రజ్యోతి'కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! పత్రిక పంపిణీలో ఏమైనా అసౌకర్యం ఎదురైందా! మాకు సమాచారమివ్వండి.. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు. ACM - 9985411394
Nalgonda ACO - 9985410334, Nalgonda-1 ACO-9985 411407, Chandur SR - 9849337588, Chityala SR - 9010198664, Nakrekal SR - 9963624250, ,Kattangoor SR - 9963624250

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 27.8
కనిష్ఠం 16.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5

మంగళవారం 9 డిసెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	577.40 (275.5168)	20,167	20,167
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	457.31	457.31
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.554 (43.5481)	900	4,400

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ :

సంగ్రామం



తారస్థాయిలో ప్రచారం

- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధికార, ప్రతిపక్షాలు
- ప్రచారంలో పాల్గొంటున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

6

అన్నా.. పైసాల్లేవా ఏందీ?

- పదవి కావాలంటే పంచాల్సిందే..
- సర్పంచ్ అభ్యర్థి, సామాన్యుడి మధ్య సరదా సంభాషణ

6

పల్లె పాలనలో ఆదర్శ దంపతులు

తొలివిడత ప్రచారం నేటితో బంద్

- నేటి సాయంత్రం నుంచి మద్యం దుకాణాలకు తాళం
- ఉమ్మడి జిల్లాలో 589 పంచాయతీల్లో తొలి విడత ఎన్నికలు
- ఈ నెల 11న పోలింగ్
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తొలివిడత ఎన్నికలు నిర్వహించే గ్రామపంచాయతీల్లో ప్రచారం వేడెక్కింది. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5గంటలతో ప్రచారం గడువు ముగుస్తుండడంతో అభ్యర్థులు, వారి తరఫున ప్రచారం చేసే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ,

అభ్యర్థుల గెలుపుకోసం ప్రచార రంగంలోకి దిగిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు వ్యూహాలు పన్నడంతో పాటు, ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఓ వైపు ప్రచారం సాగిస్తూనే, మరోవైపు బుజ్జగింపులు, తాయిలాల ఎరవేస్తూ అభ్యర్థుల గెలుపునకు శ్రమిస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాల అధికార యంత్రాంగం, పోలీసులు పోలింగ్ నిర్వహణకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సులు, ఎన్నికల సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 14 మండలాల్లోని 318 పంచాయతీలకు 21 ఏకగ్రీవం కాగా, ఇందుగుల, పేరూరు, అభంగాపురం పంచాయతీల్లో ఎన్నికలు నిలిచాయి. మిగిలిన 294 గ్రామపంచాయతీలు, 2,684 వార్డు స్థానాలకు మొదటి విడతలో పోలింగ్ జరగనుంది. సూర్యాపేట జిల్లాలో ఎనిమిది మండలాల్లోని 159 గ్రామాల్లో ఏడు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 152 స్థానాలకు, 1,241 వార్డులకు తొలిదశలో పోలింగ్ జరగనుంది. యాదాద్రి జిల్లాలో ఆరు మండలాల్లోని 153 పంచాయతీలకు 10 ఏకగ్రీవం కాగా, మిగిలిన 143 పంచాయతీలకు, 1,155 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేస్తోంది.

నేటి సాయంత్రానికి ఆగనున్న మైకులు

ప్రచారం గడువు ముగుస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో నేటితో అధికారికంగా ప్రచారం ముగియనుంది. దీంతో మొదటి విడత ఎన్నికలయ్యే గ్రామాల్లో చివరి రోజు ర్యాలీలు, సభలు నిర్వహించేందుకు అభ్యర్థులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే ఇంటింటి ప్రచారాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో చివరి రోజు ప్రతీ ఓటరును కలిసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, మాజీలు అన్ని పంచాయతీల్లో పార్టీ అభ్యర్థుల కోసం విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. నేటి సాయంత్రం 5గంటల తర్వాత ప్రచారం ఆగిపోనుండడంతో ప్రచార రథాలు, మైకులు, జెండాలను తొలగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

11వ తేదీ వరకు మద్యం దుకాణాలు బంద్

ఎన్నికల కోడ్ నేపథ్యంలో మొదటి విడత ఎన్నికలు జరిగే అన్ని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి మద్యం దుకాణాలను మూసివేస్తారు. మద్యం విక్రయాలు ఎక్కడ జరిగినా వెంటనే సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీస్, ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. 11వ తేదీ సాయంత్రం 5గంటల తరువాతే మద్యం దుకాణాలు తెరుచుకుంటాయి. అయితే గ్రామాల్లో పలువురు పార్టీల నాయకులు ఇప్పటికే మద్యం డంపులకు తరలించారని, బుధవారం మద్యం పంపిణీ ఉంటుందని ప్రచారం సాగుతోంది.



ఖుషీ

- ఉచిత బస్సు ప్రయాణంతో రూ.620.13కోట్లకు పైగా ఆదా
- ఇప్పటికి 12.35కోట్ల మంది కిపైగా ప్రయాణం
- సగటున నిత్యం ప్రయాణిస్తున్న 36.70లక్షల మంది మహిళలు
- రద్దీకి అనుగుణంగా పెరగని బస్సుల సంఖ్య
- మహాలక్ష్మి పథకానికి నేటికి రెండేళ్లు

నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని 2023, డిసెంబరు 9న అమలులోకి తెచ్చింది. దీంతో ఈ పథకానికి నేటికి రెండేళ్లు పూర్తికానున్నాయి. ఉచిత ప్రయాణంతో ఉమ్మడి జిల్లా మహిళలకు రూ.620.13కోట్లకుపైగా ఆదా అయింది. ఆ మొత్తాన్ని మహిళలు కుటుంబ అవసరాల కోసం వినియోగించారు.

మహాలక్ష్మి పథకం ప్రారంభమైన నాటి నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులను కలిసేందుకు, పండుగలు, శుభకార్యాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే మహిళలు, ఇతర ప్రాంతాల్లో పనికి వెళ్లేందుకు కూలీలు

మిగతా 7వ పేజీలో...

● **మహాలక్ష్మి పథకంతో ప్రయోజనం**



మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ప్రయోజనం చేకూరుతోంది. ఈ రెండేళ్లలో 12.35కోట్ల మంది మహిళలు ప్రయాణించారు. మహిళల ప్రయాణానికి తగిన విధంగా రీజియన్ పరిధిలో అన్ని రూట్లల్లో బస్సులు నడుపుతున్నాం. ఎలాంటి అసౌకర్యం లేకుండా బస్సులను ఏర్పాటు చేసి పథకం సద్వినియోగం అయ్యేలా చూస్తున్నాం. రానున్న రోజుల్లో మహిళా ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం.

- కె.జానిరెడ్డి, ఉమ్మడి జిల్లా రీజనల్ మేనేజర్

నామినేషన్ల ఉపసంహరణకు నేడు ఆఖరు

నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 9వ తేదీ చివరి రోజు. డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లోని 269 సర్పంచ్ స్థానాలకు, 2,206 వార్డు స్థానాలకు ఈ నెల 17న ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా, 9వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉండనుంది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏకగ్రీవ పంచాయతీలు మినహా మిగతా సర్పంచ్ స్థానాలకు 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటిస్తారు. అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహిస్తారు.



హోంగార్డుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

హోంగార్డుల సంక్షేమానికి కృషి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో భాగమైన హోంగార్డులు పోలీసులతో సమానంగా శాంతిభద్రతల పరిరక్షణలో పాల్గొంటారని, వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుల కోసం ఏర్పాటు చేసిన 'దర్బార్'లో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, నేర సంబంధిత విధుల నిర్వహణలో హోంగార్డులు క్రియాశీలక పాత్ర పోషించడం ప్రశంసనీయమన్నారు. హోంగార్డు సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం రోజువారీ వేతనాన్ని రూ.921 నుంచి రూ.1,000కి పెంచిందని, పరేడ్ అలవెన్స్ రూ.100 నుంచి రూ.200, యూనిఫాం అలవెన్స్ రూ.7,500, విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బందికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ రాము, హోంగార్డు ఆర్ఐ శ్రీను, అడ్మిన్ ఆర్ఐ సంతోష్, ఎంటీ ఆర్ఐ సూరప్పనాయుడు, ఆర్ఎస్ఐ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

(ఆంధ్రజ్యోతి, కనగల్): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని జీ.ఎడవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థులు నిబంధనలకు లోబడి ప్రచారం నిర్వహించాలన్నారు. ఓటర్లకు మద్యం, డబ్బు పంపిణీ చేయడం నిషేధమన్నారు. అంతకుముందు గ్రామంలో పోలీసు ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించాయి. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతా నిర్భయంగా ఓటేయాలి

అదనపు ఎస్పీ రమేష్



ఉప్పలంచలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రమేష్

శాలిగౌరారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు నిర్భయంగా ఓటేయాలని అదనపు ఎస్పీ రమేష్ అన్నారు. మండలంలోని ఉప్పలంచ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేలా సహకరించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటువేయాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి, ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంఘ విద్రోహ శక్తులను కఠినంగా శిక్షిస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ సైదులు, హెడ్‌కానిస్టేబుల్ నజీరుద్దీన్, పీసీలు జానయ్య, లక్ష్మణ్, నాగయ్య, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



శాలిగౌరారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీచేసి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

శాలిగౌరారం, కేతేపల్లి డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో, కేతేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. పోలింగ్ సామగ్రి, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామస్థాయి ఎన్నికలకు ప్రాధాన్యం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు కీలకంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన సామగ్రి పంపిణీలో ఆలస్యం లేకుండా చేయాలన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. బ్యాలెట్ బాక్సుల స్వీకరణలో గందరగోళం లేకుండా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిరంతరం ఉండాలని, ఓటర్ల క్యూలైన్ వ్యవస్థను అమలు చేయాలని, సీసీ కెమెరాలు ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా తాగునీరు, విశ్రాంతి గదులు, పారిశుద్ధం, వైద్య సౌకర్యాలు, ర్యాంపులు, లైటింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో కేతేపల్లి ఎంపీడీవో పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎంపీడీవోతో కలిసి పనిచేయాలని తహసీల్దార్ రమాదేవిని ఆదేశించారు. ఆమె వెంట జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీపీవో వెంకయ్య, ఆర్డీవో యారాల అశోక్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్లు బిట్ల వరప్రసాద్, రమాదేవి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, బి.శ్రీనివాసరావు, ఎంపీవో నాగలక్ష్మి, తదితరులు ఉన్నారు.

అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



కేతేపల్లి పీహెచ్‌సీలోని ఆయుర్వేద ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కేతేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం కేతేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల వివరాలను ఆస్పత్రి వైద్యాధికారి కొండ్ర అర్చనను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రసవాల వివరాలు, మందుల నిల్వలు, గడువు తేదీలను పరిశీలించారు. కుక్క, పాము కాటు వ్యాక్సిన్ నిల్వలను సమీక్షించారు. ఆసుపత్రిలోని ఆయుర్వేద విభాగాన్ని కూడా తనిఖీ చేశారు. ఇక్కడ మందులు, నిత్యం ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను వైద్యురాలు నేహను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాలరెడ్డి, ల్యాబ్‌టెక్నీషియన్ యాదగిరి, సిబ్బంది రమాదేవి, నిర్మల, మేరి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజల కోసం పనిచేసే వారినే గెలిపించాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, గ్రామాల అభివృద్ధి కోసం పనిచేసే వారినే గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాభివృద్ధికి పాటుపడే వారిని ఎన్నుకుంటేనే ప్రగతికి మార్గం ఏర్పడుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 16 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు, 145 వార్డుల్లో సీపీఎం బలపరిచిన అభ్యర్థులు పోటీచేస్తున్నారని అన్నారు. గతంలో సీపీఎం అభ్యర్థులు గెలుపొందిన గ్రామాల్లో అధికారులు, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధి పనులు చేయించడంలో ముందంజలో ఉన్నారని అన్నారు. మద్యానికి, డబ్బుకు ఇతర ప్రలోభాలకు లొంగకుండా పోటీలో ఉన్న అభ్యర్థుల గుణగణాలను చూసి ఓటు వేయాలని కోరారు. స్థానిక సంస్థలను అభివృద్ధి చేయడంలో దేశంలోనే కేరళ రాష్ట్రం ఆదర్శంగా ఉందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో 40శాతం నిధులు పంచాయితీలకు కేటాయించి విద్య, వైద్యం ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగేట్టు ఏర్పాట్లు చేశారని అన్నారు. రాష్ట్రంలో అలాంటి పాలన రావాలంటే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, గోవిందరెడ్డి, దయానంద్, సంపత్ పాల్గొన్నారు.



టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సైదులుకు ఫిర్యాదుచేస్తున్న బీసీ నాయకులు

రిజర్వేషన్లపై మాట తప్పిన సీఎం

సీఎం రేవంత్‌రెడ్డిపై నల్లగొండ బీసీ సంఘ నేతల ఫిర్యాదు

నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిన నాటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారని, ఆయనపై కేసు నమోదు చేయాలని బీసీ సంఘం నాయకులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సైదులుకు బీసీ సంఘం నాయకులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌గౌడ్, బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్లు తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీ అనే ఒక బుక్‌లెట్ కూడా తీశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోగా కొత్త జీవో 46 ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నికలు నిర్వహిస్తున్నారని వారు విమర్శించారు. బీసీలను విస్మరించినందున చట్ట ప్రకారం కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు యాదగిరి, అజయ్‌కుమార్, వెంకన్న, సతీష్, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



కేతేపల్లిలో మాట్లాడుతున్న డీపీఎం మోహన్‌రెడ్డి

కేతేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం పొదుపు సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో డీపీఎం డి.మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కేతేపల్లి మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల అభివృద్ధికి పొదుపు సంఘాల ద్వారా స్త్రీనిధి రుణాలు, బ్యాంకు రుణాలు అందిస్తున్నామన్నారు. వాటితో ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం దివ్యాంగుల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రాధిక, సీసీలు శ్రీనివాసరెడ్డి, రమణయ్య, రాజ్‌కుమార్, గంగయ్య, సిబ్బంది పద్మ, సౌజన్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు

మర్రిగూడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్టు జిల్లా ఎన్నికల సహాయ అధికారి మున్నయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో 170 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 35,785 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లుకు అన్ని వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా కొండూరు, రాజుపేట, రాంరెడ్డిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీచేశారు. ఆయన వెంట మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో బిట్టు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

నేడు ఎన్జీ కళాశాలలో జాబ్‌మేళా

నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మేగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌కేసీ, రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కెమిస్ట్రీ విద్యార్థుల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. 2021 నుంచి 2025 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు 2022 నుంచి 2025 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులు అని అన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10గంటలకు కళాశాలలోని సెమినార్ హాల్‌లో హాజరుకావాలని తెలిపారు.

ఏపీపీ పరీక్షలను వాయిదా వేయాలి

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పరీక్షను వాయిదా వేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ కోరారు. ఈ నెల 14వ తేదీన స్థానిక సంస్థల మలివిడత ఎన్నికలు ఉన్నందున, ఆ రోజున నిర్వహించనున్న పరీక్షను వాయిదా వేయాలని కోరారు. పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు విభాగాలుగా రాయాల్సి ఉన్నందున గ్రామీణ ప్రాంత అభ్యర్థులు హాజరు కాలేని పరిస్థితి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షను వాయిదా వేసేలా తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశాలివ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నాడు మామలు.. నేడు కోడళ్లు

- నిడమనూరులో పంచాయతీ పోరు రసవత్తరం
- బస్తీమే సవాల్ అంటున్న నారీమణులు


శేషరాజు సంధ్య


బొల్లం సునీత

నిడమనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మేజర్ గ్రామ పంచాయతీ పోరు రసవత్తరంగా మారింది.గతంలో మామలు పోటీ చేయగా ప్రస్తుతం వారి కో డళ్లు తలబడుతున్నారు. 2006లో నిడమనూరు పంచాయతీ సర్పంచ్ పదవి బీసీలకు రిజర్వు కావడంతో కాంగ్రెస్ పార్టీ తరఫున శేషరాజు భిక్షమయ్య, టీడీపీ తరఫున బొల్లం బాలయ్య బరిలో నిలిచారు. మెజార్టీ వార్డులు కాంగ్రెస్ గెలిచినా సర్పంచ్‌గా మాత్రం టీడీపీ అభ్యర్థి బొల్లం బాలయ్య అనూహ్యంగా గెలిచారు. అప్పట్లో ఇది చర్చనీయాంశమైంది. ఇప్పుడు సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వు కావడంతో కాంగ్రెస్ తరఫున శేషరాజు భిక్షమయ్య కోడలు సంధ్యశ్రీనివాస్ పోటీ చేస్తుండగా, బీఆర్ఎస్ తరఫున బొల్లం బాలయ్య కోడలు సునీతసైదులు బరిలో నిలిచారు. ఇద్దరు మహిళా అభ్యర్థులు బస్తీమే సవాల్ అంటూ పోటీ పడుతున్నారు. మేజర్ పంచాయతీని దక్కించుకునేందుకు రెండు పార్టీలు కసిగా పని చేస్తున్నాయి. కార్యకర్తలు హోరాహోరీగా పోరాడుతున్నారు. రంగంలో మరో నలుగురు ఉన్నా పోటీ ఈ ఇద్దరి మధ్యే ఉంది. దీంతో గెలుపుపై ఉత్కంఠ ఏర్పడింది. విజయం తమదే అని ఇరువురు చెబుతున్నప్పటికీ ఈ సారి సెంటిమెంట్ గెలుస్తుందా, అధికారం గెలుస్తుందా అంటూ ఓటర్లు గుసగుసలాడుకుంటున్నారు. ఎవరు గెలుస్తారో ఈ నెల 14న తెలియనుంది.

ఓటర్లకు సకల మర్యాదలు

- తెల్లారక ముందే ప్రత్యక్షం
- ఓటర్లకు గాలం వేసేందుకు ఎత్తులు



పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పీఏపల్లి, గుడిపల్లి మండలాల పంచాయతీ పోరులో ఉన్న అభ్యర్థులు గుర్తులు రాకముందే ఓటర్లకు సకల మర్యాదలు చేస్తున్నారు. మూడో విడతలో జరిగే పంచాయతీ పో రులో ఉన్న అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. తెల్లారక ముందే ఓటర్ల ఇంటి ముంగిట్లోకి వాలిపోతూ మామ.. అత్త.. అవ్వ.. అమ్మ.. వదిన.. అన్న.. బాగున్నారా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ మీ ఓటు ద్వారా నన్ను ఆశీర్వదించాలని ప్రాధేయపడుతున్నారు. గెలిపిస్తే ఐదేళ్ల పాటు మీకేమి కావాలో నేను చేసి పెడతానని భరోసా ఇస్తున్నారు. గ్రామాభివృద్ధితో పాటు ఏ చిన్న సమస్యనైనా పరిష్కరిస్తానని ఈ ఒక్కసారికి మీ అందరి ఓట్లు వేసి నన్ను గెలిపించాలని విన్నవిస్తున్నారు. పలువురు అభ్యర్థులు ఓటర్ల కాళ్లు పట్టుకొని కాళ్ల బేరాలకు సైతం వెనుకాడటం లేదు. ఓటు వేసి ఆశీర్వదించాలని కాళ్లకు దండం పెట్టుకుంటున్నారు. పార్టీల ముఖ్యనేతలకు ఫోన్‌లో ఓటర్లతో మాట్లాడిస్తూ తమ మద్దతుదారులను గెలిపించాలని కోరుతున్నారు. తమ మద్దతుదారులను గెలిపిస్తే గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని ప్రధాన పార్టీల ముఖ్య నాయకులు ఓటర్లకు అభయం ఇస్తున్నారు. ఓటు బ్యాంకు పెంపొందించుకునేందుకు బరిలో ఉన్న అభ్యర్థులు ఓటరు మహాశయులకు సకల మర్యాదలు చేస్తున్నారు. డిసెంబరు 17వ తేదీన జరిగే పంచాయతీ పోరులో ఎవరు గెలుస్తారో వేచిచూడాలి మరీ.

ఒకే కుటుంబానికి 50 ఏళ్లు సర్పంచ్ పట్టం

- 'గాలి' కుటుంబాలకే కొనసాగిన ఆదరణ


గాలి రవికుమార్

గుర్రంపోడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గుర్రంపోడు గ్రామపంచాయతీకి ఒకే కుటుంబం 50 ఏళ్లుగా సర్పంచ్‌గా కొనసాగింది. 1964 నుంచి 1987 వరకు సర్పంచ్‌గా పనిచేసిన దివంగత గాలి జంగయ్య సర్పంచ్‌గా కొనసాగుతూ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. ఆ కాలంలో చింతపల్లి సమితి వైస్ ప్రెసిడెంట్‌గా చేయడంతో పాటు మునుగోడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశారు. ఆ తర్వాత ఆయన అన్న కుమారుడు గాలి విజయ్‌కుమార్ 1987 నుంచి 1995 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. అనంతరం 1995 నుంచి 2006 వరకు వరుసగా రెండు పర్యాయాలు గాలి జంగయ్య కుమారుడైన గాలి రవికుమార్ సర్పంచ్‌గా పనిచేశారు. ఆ తర్వాత గాలి జంగయ్య భార్య సుగుణమ్మ 2007 నుంచి 2014 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. తదనంతరం రిజర్వేషన్ ఎస్సీ కావడంతో 50 ఏళ్ల సర్పంచ్ పదవి పొందిన కుటుంబానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత కూడ వీరి కుటుంబం రాజకీయ హవా కొనసాగుతూనే ఉంది. జడ్పీటీసీగా గాలి రవికుమార్, తర్వాత అతని భార్య సరితరవికుమార్ ఇప్పటివరకు జడ్పీటీసీగా కొనసాగుతూ రాజకీయ ఆధిపత్యాన్ని నిలుపుకుంటూ వస్తున్నారు.


వేతనం తక్కువ.. ఖర్చు ఎక్కువ

- సర్పంచ్ నెల వేతనం రూ.6,500 మాత్రమే..
- పదవి దక్కించుకోవడానికి మాత్రం లక్షల్లో ఖర్చు



పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా పోటీ చేసేందు కు అధిక సంఖ్యలో ఆశావహులు ఉత్సాహపడుతుంటారు. సర్పంచ్ పదవి దక్కించుకోవడానికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తుంటారు. వారి ఉత్సావం గెలుపొందడానికి వారు పెడుతున్న ఖర్చు చూసి ప్రజలు సర్పంచ్‌కు ఎంత వేతనం వస్తుందో, ఆ పదవి ద్వారా ఎంత ఆదాయం ఉంటుందో, అందుకే అంత ఖర్చు చేస్తున్నారని అనుకుంటారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి ఒక్కొక్కరిని బతిమిలాడి సర్పంచ్‌గా గెలిస్తే వారి కి నెలకు వచ్చే వేతనం రూ.6,500 మాత్రమే. అది కూడా నెలనెలా రాదు, ఎప్పుడో ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పుడు తీసుకోవాలి. 1992కు ముందు సర్పంచ్‌లకు వేతనాలు లేవు, ఆ తర్వాత చిన్న గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు రూ.600, మేజర్ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు రూ.1000 మాత్రమే ఇచ్చేవారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ 2015 ఏప్రిల్ 1 నుంచి సర్పంచుల వేతనం రూ.5వేలు చేశారు. ఆ తర్వాత 2021లో దానిని రూ.6,500కు పెంచారు. గతంలో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తే ఖర్చులన్నా మిగిలేవి. 2018 తర్వాత నుంచి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో చిల్లిగవ్వ ఆదాయం రాకపోగా పనులు చేయడానికి తెచ్చిన అప్పులకు వడ్డీలు మీద పడుతున్నాయని పలువురు వాపోతున్నారు. మరి ఇంత తక్కువ వేతనం, పనులు చేసిన పైసలు రాకపోయినప్పుడు అంత పోటీ ఎందుకు, ఎందుకు ఖర్చు చేస్తారంటే సర్పంచ్ ఆ గ్రామ ప్రథమపౌరుడు. ఆ హోదా, ఆ దర్పం, దర్జా దక్కించుకోవడం కోసం ఉన్నది అమ్మి అయినా సరే అప్పులు చేసినా అయినా సరే విజయం సాధించాలని పోరాటం చేస్తుంటారు.

పట్టణంలో థాంక్స్ గివింగ్ వేడుకలు


థాంక్స్ గివింగ్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరంలో సోమవారం థాంక్స్ గివింగ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్ద ధీరావత్ హన్యానాయక్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగకు ముందుగా ప్రపంచవ్యాప్తంగా థాంక్స్ గివింగ్ వేడుకలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. నవంబర్ మూడో ఆదివారం ప్రారంభమయ్యే కృతజ్ఞత సంబరాలు క్రీస్తు పుట్టినరోజు వరకూ జ రుగుతాయన్నారు. అనంతరం క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమాబాయి, సుధారాణి, డేవిడ్, జనార్ధన్, మరియ మ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల గ'మ్మత్తు'

- మత్తులోకి జారుతున్న పల్లె
- గ్రామాల్లోకి దిగుమతి అవుతున్న మద్యం
- ప్రచారానికి వెయ్యి.. పనులకు నై
- పంచాయతీ ఎన్నికల చిత్రాలు



(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

పల్లెకు మత్తెక్కుతోంది. రెండోవిడత పోలింగ్ జరిగే పంచాయతీలకు నామినేషన్ల ఉపసంహరణ ముగిసిది. గుర్తులు కేటాయించడంతో ప్రచారం ఊపందుకుంది. ఆదివారం గ్రామాల్లోకి భారీగా మద్యాన్ని దిగుమతి చేస్తున్నారు. సెలవురోజు కావడంతో ప్రభుత్వ ప్రైవేట్ కొలువుల చేసేవారు ఊర్లకు చేరారు. అన్నా, అక్కా, వదిన, బావ వరసలు కలుపుతూ మాంసం, మందుతో విందు చేసి ఎన్నికల గుర్తులను పరిచయం చేసి అభ్యర్థులు ఓటును అర్థిస్తున్నారు. వార్డుల వారీగా మందు బాటిళ్లను తమ మద్దతుదారుల ఇళ్లల్లోకి రాత్రి సమయంలో డంపు చేస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ పడుతున్న అభ్యర్థులు ప్రచారం తొలిరోజు నుంచే విడివిడిగా మద్యం పంపకాలు సాగిస్తున్నారు. ఏ బ్రాండ్ మద్యం వాడుతారో తెలుసుకుని మరీ సరఫరా చేస్తుడటం విశేషం. పోటీ తీవ్రంగా ఉన్న పంచాయతీల్లో అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకు వెనకాడటంలేదు. నువ్వా.. నేనా అన్నట్లు సాగుతున్న గ్రామాల్లో ఒక్కో సర్పంచ్ అభ్యర్థి 35 నుంచి రూ.50 లక్షలకు పైగా డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. డివిజన్‌లో కొన్ని పంచాయతీల్లో ఐదారుగురు సర్పంచ్ పదవికి పోటీ పడుతుండగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఓటుకు వెయ్యి రూపాయలతో పాటు మహిళలకు చీరెలు, మగవారికి మద్యం సీసాలు పంపిణీ చేస్తున్నారు. కుటుంబంలో ఎన్ని ఓట్లుంటే అన్ని క్వార్టర్ సీసాలు పంచుతున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు డబ్బులు, మందు సీసాలను విడివిడిగా పంచుతుండటంతో ఐదారుగురు పోటీచేసిన పంచాయతీల్లో ఇంటింటికీ పదుల సంఖ్యలో బాటిళ్లు చేరుతున్నాయి. ఒక్కో అభ్యర్థి 4 నుంచి రూ.5 లక్షలు మద్యం దిగుమతికే ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఊరంతా మత్తులో జోగుతోంది.

జోరుగా నడుస్తున్న బెల్ట్ షాపులు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నా అవి జోరుగా సాగుతునే ఉన్నాయి. చీప్ లిక్కర్, తక్కువ ధర కలిగిన క్వార్టర్ సీసాలను, బీర్లను అమ్మే బెల్ట్ షాపులు వారు ఎన్నికల సమయంలో అభ్యర్థుల అవసరాలను బట్టి ఆయా రకాల ఖరీదైన బ్రాండ్‌లను, ఫుల్ బాటిళ్లను సైతం విక్రయిస్తున్నారు.

పోలీసుల చర్యలేవీ ?

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు, ఓటరు తన విచక్షణతో ఓటును సద్వినియోగం చేసుకునేందుకు గ్రామాలను మద్యానికి దూరంగా ఉంచేందుకు ఎన్నికల కోడ్ రూపొందించగా అధికారుల అలసత్వంతో కోడ్ ఉల్లంఘన జరుగుతోంది. నిబంధనలను సక్రమంగా అమలు చేయని వారిపై చర్యలు చేపట్టకపోవడంతో పోలీసుల అలసత్వాన్ని ఆసరా చేసుకొని ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అభ్యర్థులు అడ్డదారులు తొక్కుతున్నారని విమర్శలు వస్తున్నాయి. పోలీసులు నిఘా వైఫల్యం వల్లే భారీ ఎత్తున గ్రామాల్లోకి మద్యం దిగుమతి అవుతోందని, బెల్ట్‌షాపుల్లో విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే చర్యలపై గట్టి నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. కోడ్ ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కొరడా ఝులిపించాలని కోరుతున్నారు.

ప్రచారానికి వెయ్యి రూపాయలు



అభ్యర్థి వెంట గ్రామంలో ప్రచారానికి తిరిగితే రూ. 1,000తో పాటు తాగినంత మందు పోస్తుడటంతో వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం ఆయకట్టులో యాసంగి సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి నార్లు పోసుకున్న రైతులు దమ్ము చేసి వరాలు చెక్కేందుకు మనుషుల కోసం వెతుకుతుండగా పంచాయతీ ఎన్నికల కారణంగా కూలీలు దొరికే పరిస్థితి కనిపించడం లేదని రైతులు పేర్కొంటున్నారు. వరాల చెక్కితే రోజు కూలీ 1,100 అయినా ప్రచారానికి వెళితే కష్టపడకుండా వెయ్యి రూపాయలు రావడంతో పాటు మత్తెక్కేందుకు కడుపునిండా మందు కూడా పోస్తుడటంతో వ్యవసాయ పనులు నాకా పెడుతున్నారని రైతులు పేర్కొంటున్నారు.

బరిలో ఉండేదెవరో...?

- ఉపసంహరణకు ఒక్కరోజే గడువు
- దేవరకొండ డివిజన్‌లో పూర్తయిన నామినేషన్లు
- జోరుగా కొనసాగుతున్న బుజ్జగింపులు

దేవరకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో మూడవ విడత గ్రామపంచాయతీల సర్పంచ్ ఎన్నికలు ఈ నెల 17వ తేదీన జరగనున్నాయి. డివిజన్‌లోని 9 మండలాలు 269 గ్రామపంచాయతీల్లో సర్పంచులకు 1962 మంది, 2206 వార్డులకు 5606 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఈ నెల 9వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల ఖరారు, గుర్తులను అధికారులు ప్రకటించనున్నారు. దీంతో వివిధ పార్టీల నుంచి నామినేషన్లు వేసిన అభ్యర్థులు పోటీ చేసేందుకు సిద్ధమవుతుండటంతో రాజకీయపార్టీల నాయకులు వారిని బుజ్జగించే చేసే పనిలో నిమగ్నమయ్యారు. అప్పుడే అయిపోయిందా, అవకాశాలు ఉన్నాయి తొందరపడవద్దని నామినేషన్లు ఉపసంహరించుకొని సహకరించాలని అభ్యర్థులకు ప్రధాన పార్టీల ముఖ్య నేతలు చెబుతున్నారు. దేవరకొండ డివిజన్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచుల కోసం అధిక సంఖ్యలో నామినేషన్లు వేశారు. పోటీ ఎక్కువగా ఉండటంతో నామినేషన్లు వేసిన అభ్యర్థులతో చర్చించే పనిలో అధికార పార్టీ నేతలు ఉన్నారు. దేవరకొండలో ఈ నెల 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణులలో ఉత్సాహం అలుముకుంది. అధికారంలో ఉండటంతో గెలుస్తామన్న ధీమాతో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్లు వేశారు. పోటీ ఎక్కువగా ఉండటంతో వారిని బుజ్జగించి ఏకతాటి పైకి తెచ్చేందుకు ఎమ్మెల్యే బాలునాయక్‌తో పాటు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. దేవరకొండ మండలంలో చిన్న గ్రామపంచాయతీలు, తండాలు అత్యధికంగా ఏకగ్రీవమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి పోటీలో గెలిచే అభ్యర్థులనే రంగంలో దింపేందుకు సన్నద్ధమవుతున్నారు. బీఆర్ఎస్‌లోనూ పోటీ అధికంగా ఉండటంతో నామినేషన్లు వేసిన అభ్యర్థులకు బుజ్జగించి మరో అవకాశం ఇస్తామని నచ్చచెప్పే పనిలో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో సీపీఐ బలమున్న స్థానాలను సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో నిలిపేందుకు కాంగ్రెస్ పార్టీతో చర్చలు చేస్తున్నారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులను కూడా కొన్ని స్థానాలు తమకు కేటాయించాలని చర్చిస్తున్నారు. నామినేషన్ల ఉప సంహరణ ఈ నెల 9వ తేదీ కావడంతో వివిధ పార్టీల నేతలు అత్యధికంగా నామినేషన్లు వేసిన అభ్యర్థులతో చర్చించి ఒప్పించి ఏకతాటిపైకి తెచ్చేందుకు వారి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. బీజేపీ దేవరకొండ డివిజన్‌లో తమకు బలమున్న స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతుంది. సీపీఎం, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఈ నెల 9వ తేదీన నామినేషన్ల ఉప సంహరణ, అభ్యర్థుల ఖరారు, గుర్తులు కేటాయించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో డివిజన్‌లోని పలు గ్రామాల్లో ఎన్నికల సందడి ఊపందుకుంది. ఆయా పార్టీలు సర్పంచ్ అభ్యర్థులను ఎవరిని ప్రకటించనున్నారో ఈ నెల 9వ తేదీన తేలనుంది.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


సల్కునూరు గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో మౌలిక వసతులకు అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకుల మాయమాటలకు మోసపోకుండా అభివృద్ధికి కట్టుబడి పనిచేసే కాంగ్రెస్ అభ్యర్థులను స్థానిక సంస్థల్లో గెలిపించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థులు పిల్ల సందీప్, ఎల్లికట్ట భరత్, పెదపంగ వెంకన్న, దేశిడి శ్రీనివాస్‌రెడ్డి, మారబోయిన సతీష్, శీలం శ్రీను, చక్కని ఉపేంద్రమ్మ, జెర్రిపోతుల మౌనిక, బొర్రి లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, నాయకులు పుట్టల కృపయ్య, వెంకట్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం దేవరకొండలో వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి మాట్లాడారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహ, కిష్టు, శంకర్‌నాయక్, రాంబాబు, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని ధైర్యపూరి తండాకు చెందిన మాజీ సర్పంచ్ బాల్‌సింగ్‌తో పాటు మరో 15మంది నాయకులు మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతావత్ బీల్యానాయక్, మాజీ సర్పంచులు బిచ్యానాయక్, చందర్ నాయక్, దాసు నాయక్ పాల్గొన్నారు.


అనుముల ఎంఈవోగా శ్రీనయ్య

హాలియా, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనుముల మండల విద్యాధికారిగా శ్రీనయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని మారేపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనయ్య పదోన్నతిపై లభించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, సంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈవో శ్రీనయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి టీచర్లు కృషి చేయాలని అన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

- సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు తమ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. మండలంలోని జువ్విచెట్టుతండా, గరికెనెట్‌తండా, కీచ్యాతండా సర్పంచులు భిక్షానాయక్, సపావత్ బాలునాయక్, వాంకుడోతు లలితలాలునాయక్, ఉపసర్పంచులు మునినాయక్, బనావత్ బాలు, మునినాయక్ సోమవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డితో కలిసి శాలువాతో సత్కరించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిచేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఈ తండాల్లో సర్పంచ్, ఇతర పదవులను గ్రామస్థులను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఏకగ్రీవంగా చేసేందుకు కృషి చేసిన డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్‌రెడ్డిని జానారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఏకగ్రీవ సర్పంచులు, ఉపసర్పంచులను అభినందిస్తున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

పర్యావరణాన్ని పరిరక్షించాలి

మిర్యాలగూడటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సోషల్ వర్కర్ రావుల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నియంత్రణలపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. స్వయంగా పెంచిన మొక్కలను రైతులకు ఉచితంగా అందిస్తున్నానని, కూడళ్ల, ప్రధాన కార్యాలయాల ఎదుట ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రకృతి ప్రసాదించిన వనరులను పరిరక్షించుకునేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

మండల పూజ మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

దేవరకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేవరకొండ అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి మండలపూజ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని దేవాలయ గురుస్వామి చంద్రమౌళి స్వామి, నాగేశ్వరంస్వాములు కోరారు. పట్టణంలోని దేవాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మండల పూజ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఆలయంలో 39వ మండలపూజ మహోత్సవంలో భాగంగా ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మండలపూజ, మండల పడి పూజ, అభిషేకం, ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు వేలాది మంది భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయకమిటీ నిర్వాహకులు సుబ్బారావు, వెంకటేశ్వర్లు, రమేష్, చండీశ్వర్, జల్దా భాస్కర్, వెంకటయ్య, జయంతి, పున్న శైలజ, గంజి శ్రీనివాసులు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.


మద్యం దుకాణాన్ని తొలగించాలి


దేవరకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డులో కాలనీ, జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన వైన్స్‌షాపును, పర్మిట్‌రూంలను రద్దు చేయాలని కాలనీవాసులు సోమవారం ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి వెంకటయ్య వారికి మద్దతు ప్రకటించి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే మరో ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య, జగతయ్య పాల్గొన్నారు.


విద్యార్థినులు మానసికంగా బలంగా ఉండాలి


దేవరకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకొని మానసికంగా బలంగా ఉండాలని పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు సంతోష్, యాక్షన్‌ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఖాజాఖైరత్ అన్నారు. దేవరకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్, యాక్షన్‌ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.12 వేల విలువైన శానిటరీ ప్యాడ్లను 9, 10 తరగతి విద్యార్థినులకు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు చదువులో రాణించి 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ నిర్వాహకులు ఖాజాఖైరత్, ప్రధానోపాధ్యాయురాలు రెబకా, జయ, ఉమ, ఉపాధ్యాయులు, సంస్థ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాడ్గులపల్లిలో ఐదు పంచాయతీలు ఏకగ్రీవం

గజలాపురం

బ్రాహ్మల్ల రోజా

చెర్వుపల్లి

వడ్డె సైదిరెడ్డి

దాచారం

బెల్లి జానయ్య

పోరెడ్డిగూడెం

జూలకంటి లలిత

కొత్తగూడెం

గడ్డం పద్మ

మాడ్గులపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండోవిడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఐదు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉండగా మండలం మొత్తం మూడు నియోజకవర్గాల పరిధిలో ఉంది. నల్లగొండ నియోజకవర్గంలోని గ్రామాలైన చెర్వుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా వడ్డె సైదిరెడ్డి, కొత్తగూడెం సర్పంచ్‌గా గడ్డం పద్మ, దాచారం సర్పంచ్‌గా బెల్లి జానయ్య ఎన్నిక కాగా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని పోరెడ్డిగూడెం సర్పంచ్‌గా జూలకంటి లలిత, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని గజలాపురం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా బ్రాహ్మల్ల రోజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని మిగిలిన గ్రామపంచాయతీలైన 23లో అభంగాపురం గ్రామపంచాయతీకి ఎస్టీ రిజర్వేషన్ కావడంతో ఎస్టీ ఓటర్లు లేకపోవడంతో అక్కడ వార్డు సభ్యులు, ఉపసర్పంచ్ కోసం పోటాపోటీగా తలపడుతున్నారు. అభంగాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ కైవసం చేసుకునేందుకు ఇరుపార్టీలు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. అదేవిధంగా ఇందుగుల గ్రామపంచాయతీ ఎస్టీ మహిళ రిజర్వ్ కావడంతో హైకోర్టు ఎన్నికల ప్రక్రియను చేపట్టవద్దని గ్రామానికి చెందిన ధరావత్ కల్పన హైకోర్టును ఆశ్రయించడంతో రెండోవిడతలో జరిగే ఇందుగుల గ్రామపంచాయతీ ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 21 గ్రామపంచాయతీలకు ఈనెల 14న ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందులో 62 మంది సభ్యులు సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉండగా మండలంలో 238 వార్డులు ఉన్నా ఏకగ్రీవంగా 34 వార్డులు ఏకగ్రీవం కాగా 204 వార్డులకు 421 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో..
'ఆంధ్రజ్యోతి'కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! పత్రిక పంపిణీలో ఏమైనా అసౌకర్యం ఎదురైందా! మాకు సమాచారమివ్వండి.. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు. సంప్రదించగలరు : మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా
ACM - 9985411394 Miryalguda ACO - 9963624250, Miryalguda SR - 9542690885, Devarkonda SR - 9392062350, Haliya SR - 9885226544